సోమవారం
11-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 169
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అట్లాంటాలో కాల్పులు: ముగ్గురి మృతి

అట్లాంటా: జార్జియా రాజధాని నగరం అట్లాంటాలో కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ముగ్గురు చనిపోగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బక్‌హెడ్ జిల్లాలోని పీచ్‌ట్రీ రోడ్డు సమీపంలోని ఓ అపార్టుమెంట్‌లో కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. మృతులు 20ఏళ్ల లోపు వారన్నారు. గాయపడిన యువకుడిని ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. మాదకద్రవ్యాల వ్యవహారమే ఈ ఘటనకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల సమాచారం తెలియలేదని, కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సీపీఐ కేరళ తాత్కాలిక కార్యదర్శిగా

వినయ్ విశ్వం

కొట్టాయం: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కేరళ రాష్ట్ర తాత్కాలిక కార్యదర్శిగా వినయ్ విశ్వం ఎన్నికయ్యారు. కొట్టాయంలో ఆదివారం పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. దీనికి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వినయ్ విశ్వంకు రాష్ట్ర కార్యదర్శిగా తాత్కాలిక బాధ్యతలు ఇవ్వాలని కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి కణం రాజేంద్రన్ ఆకస్మిక మరణంతో ఈ మేరకు నిర్ణయించారు. వినయ్ విశ్వం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాజా తెలిపారు. తదుపరి కార్యాచరణను తర్వాత నిర్ణయిస్తామని చెప్పారు. కార్యవర్గ నిర్ణయాన్ని ఈనెల 28న జరగబోయే రాష్ట్ర సమితి సమావేశంలో ఆమోదించాల్సి ఉంది. కాగా, రాజేంద్రన్ అనారోగ్యానికి గురైనప్పటి నుంచి ఈ పదవి కోసం వినయ్ విశ్వం పేరు వినిపిస్తోంది. మూడు నెలల సెలవుపై వెళ్లేటప్పుడు తన స్థానంలో వినయ్ విశ్వంను నియమించాలని కణం రాజేంద్రన్ స్వయంగా సిఫార్సు చేశారు. తన నియామకంపై వినయ్ విశ్వం స్పందిస్తూ కార్యవర్గం నిర్ణయానికి రాష్ట్ర సమితి ఆమోదం లభిస్తుందన్నారు. అయితే రాజ్యసభ ఎంపీగా వినయ్ విశ్వం పదవీ కాలం త్వరలోనే ముగియనుంది. ఆయన కేరళ రాష్ట్ర అటవీ శాఖ మాజీ మంత్రి. రాష్ట్ర రాజకీయాలపై అవగాహనగల నాయకుడు. అందుకోసమే పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వినయ్ విశ్వం సరైన నేతగా సీపీఐ భావించింది.

రాజేంద్రన్‌కు కన్నీటి వీడ్కోలు
అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

8లో

వైసీపీలో వణుకు

- తెలంగాణ ఫలితాలతో కలవరం
- సిట్టింగుల సీట్లకు ఎసరు
- కొత్తవారి కోసం జగన్ కసరత్తు
- అధికార పార్టీలో వర్గ విభేదాలు
- ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో వ్యతిరేకత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే ఎన్నికల్లో గెలుపొందేందుకు అధికార వైసీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యూహ రచన చేస్తున్నారు. ఇందులో భాగంగా సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో చాలామందికి ఝలక్ ఇవ్వనున్నారు. ప్రజా వ్యతిరేకత, అవినీతి ఆరోపణలతో ఓటమి పాలయ్యే 30 మందికిపైగా సిట్టింగ్‌లకు టికెట్ ఇవ్వకూడదని నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో ఆ పార్టీ సిట్టింగ్‌లలో అసంతృప్తులు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ఫలితాలు...అధికార పార్టీని ఆందోళనకు గురిచేస్తున్నాయి. త్వరలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో అప్పుడే రాజకీయ వ్యూహాలు మొదలయ్యాయి. ఆయా పార్టీలు ఎన్నికల్లో తమ బల నిరూపణకు సిద్ధమయ్యాయి. అధికార పార్టీ మళ్లీ గెలుపు దిశగా ప్రయత్నిస్తుండగా... దానికి దీటుగా ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా వ్యూహాలు పన్నుతున్నాయి. 2019 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైసీపీ తిరుగులేని విజయం సాధించింది. 175 ఎమ్మెల్యే స్థానాలకుగాను 151 ఎమ్మెల్యేలు, 22 ఎంపీ సీట్లను కైవసం చేసుకుంది. ఇప్పుడు అదే సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలతో ఎన్నికలకు వెళ్తే సగంమందికి పైగా ఓటమి చెందడం ఖాయమన్న సర్వేల సంకేతాలు ఆ పార్టీ నేతలకుఆందోళన కలిగిస్తున్నాయి. చాలా మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లు, నియోజకవర్గాల్లో వారిపె పూర్తి స్థాయిలో వ్యతిరేకత ఉన్నట్లు ప్రచారముంది. నియోజకవర్గాల్లో అందుబాటులో లేకుండా వారి సొంత వ్యాపారాలు, భూ దందాలు, అక్రమాలకు పరిమితమైనట్లు అనేక సంఘటనలు వెలుగు చూశాయి. దానికితోడు నియోజకవర్గాల్లో వైసీపీ నేతల మధ్య వర్గ విభేదాలు రచ్చకెక్కాయి. సిట్టింగ్‌లకు సీట్లు ఇస్తే ఓడిస్తామంటూ, వ్యతిరేక వర్గం నేతలు బలంగా చెబుతున్నారు. అధికార సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలపై ఉన్న ప్రజా వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు వెరసి విపక్షాలకు కలిసి వచ్చే అవకాశముంది. వైసీపీ ప్రాంతీయ స్థాయి సమావేశాల్లో ఎప్పటికప్పుడు వెనుకబాటుకు గురైన ఎమ్మెల్యేలను సీఎం జగన్ హెచ్చరిస్తూ... వారి పనితీరులో మార్పులేకుంటే ఇక టికెట్లు ఇవ్వడం సాధ్యం కాదని నొక్కిచెప్పారు. అప్పటి నుంచి వెనుకబాటుకు గురైన సిట్టింగ్ ఎమ్మెల్యేలంతా అసంతృప్తితో ఉన్నారు. తమకు టికెట్లు ఇవ్వకుంటే తమ తనయులకుగానీ, కుటుంబ సభ్యులకుగానీ ఇవ్వాలంటూ అధినేతకు విన్నవిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో వైనాట్ 175 లక్ష్యంతో వెళ్తున్న సీఎం జగన్‌కు, ప్రస్తుతమున్న 151సీట్లలో సగం మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఓటమి పాలవుతారని సర్వేలు సూచించడం పార్టీ ఆధిష్ఠానానికి షాక్‌గా మారింది. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలలో 90 శాతానికిపైగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఓటమి పాలయ్యే అవకాశాలున్నాయి. దీంతో 30 మందికిపైగా సిట్టింగ్ ఎమ్మెల్యేల సీట్లకు ఆధిష్ఠానం చెక్ పెట్టే ఆలోచనలో ఉంది. ఇక ఆ సంఖ్య 30 నుంచి 50 మందికి పెరిగే అవకాశాలున్నాయి. వారి స్థానంలో అధికంగా యువత, విద్యావంతుల్కైన కొత్త ముఖాలకు టిక్కెట్లు ఇస్తారనే ప్రచారముంది. అధినేత నిర్ణయంతో ఎవరికి టికెట్ వస్తుందో?, ఎవరికి రాదో? అనే ఆందోళనలో సిట్టింగ్ ఎమ్మెల్యేలున్నారు.

ఇక పది మందికిపైగా సిట్టింగ్ ఎంపీలకూ టికెట్ల విషయంలో చెక్ పెట్టే దిశగా వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. గత ఎన్నికల్లో 22 ఎంపీలను వైసీపీ కైవసం చేసుకుంది. విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం లోక్‌సభ స్థానాలను టీడీపీ గెలుపొందింది. లోక్‌సభ, రాజ్యసభలలో అత్యధిక ఎంపీలను కలిగిన పార్టీగా వైసీపీ మూడో స్థానంలో నిలిచింది. కొందరు ఎంపీలు వారి సొంత కార్యక్రమాలకే పరిమితమవడం, సీఎం జగన్ మెప్పు కోసం నిత్యం క్యాంపు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేస్తున్నారు. తమ వెనుక పార్టీ అధినేత సీఎం ఉన్నారని పైకి చెప్పుకుని లాబీయింగ్‌కు పాల్పడుతూ, నియోజకవర్గ ప్రజలను విస్మరిస్తున్నారని వైసీపీ శ్రేణులు వాపోతున్నారు. గత ఎన్నికల్లో ఎంపీలు, వారి కుటుంబ సభ్యుల ఆస్తులకు, ప్రస్తుతం ఆస్తులకు పోలిస్తే గణనీయంగా పెరిగినట్లుగా తెలిసింది. దీంతో పార్టీ బలోపేతం కంటే వారి సొంత లబ్ధి కోసమే నడుచుకున్నట్లు సర్వేల్లో వెల్లడైనట్లు సమాచారం. పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిల్లో ఎమ్మెల్యేలను కలుపుకుని వెళ్లకుండా, అక్కడ సైతం సామాజిక వర్గాల ఆధారంగా గ్రూప్‌లు కట్టడంతో ఈ పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. కొందరు ఎంపీలు ఏకంగా తమ సామాజిక వర్గం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా లాబీయింగ్ నిర్వహించి, రాబోయే ఎన్నికల్లో సీట్లకోసం అధినేతపై ఒత్తిడి చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. 2014 ఎన్నికల్లో కేవలం సీఎం జగన్ ప్రభావంతోనే అత్యధికంగా సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు గెలిచినట్లుగా ఆ పార్టీ అధినాయకత్వం భావిస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పనితీరులో వెనుకబాటుకు గురైన దాదాపు 10 మంది సిట్టింగ్ ఎంపీలకు రాబోయే ఎన్నికల్లో టికెట్లు నిరాకరించే అవకాశముంది. వారిలోనూ అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ ఎంపీలు ఉన్నారు. కాగా కొంత మంది ఎంపీలను ఎమ్మెల్యేలుగా బరిలో దించనున్నట్లు తెలిసింది. విజయవాడ, గుంటూరు ఎంపీలుగా వైసీపీ తరపున పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. కొంత మంది రాష్ట్ర మంత్రులు, మాజీ మంత్రులను ఎంపీలుగా బరిలో దించేందుకు వైసీపీ ఆధిష్ఠానం కసరత్తు చేస్తోంది.

తెలంగాణ ఎన్నికల ప్రభావం పడుతుందా?

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రభావం ఏపీ ప్రభుత్వంపై ఉంటుందా?, లేదా? అనేదీ అంతుపట్టడం

- మిగతా 2 లో

తుపానును జాతీయ విపత్తుగా ప్రకటించాలి
ప్రధాని మోదీకి చంద్రబాబు లేఖ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తుపానును జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి సాయం చేయాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తుపాను వల్ల నష్టపోయిన ఆంధ్ర ప్రదేశ్ ప్రజలను ఆదుకోవాలని ప్రధాని మోదీకి ఆదివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో తుపాను తీవ్ర ప్రభావం చూపించిందని, 22 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. రూ.10 వేల కోట్ల మేర పంట నష్టంగా అంచనా ఉందని తెలిపారు. దాదాపు 770 కిలోమీటర్ల మేర రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని, తాగునీరు, నీటిపారుదల, విద్యుత్, కమ్యూనికేషన్ రంగాలకు నష్టం వాటిల్లిందని, వ్యవసాయంతో పాటు ఆక్వా రంగం కూడా నష్టపోయిందని వివరించారు. నష్టం అంచనాకు కేంద్ర బృందాన్ని పంపాలని లేఖలో చంద్రబాబు కోరారు.

19న దిల్లీలో ఇండియా భేటీ

మోదీపై పోటీకి 'నేను కాదు, మేము' నినాదం

న్యూదిల్లీ: ప్రతిపక్ష పార్టీల 'ఇండియా' కూటమి సమావేశం తేదీ ఖరారైంది. ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు న్యూదిల్లీలో ఇండియా కూటమి సమావేశం జరగబోతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ మాధ్యమంగా ఆదివారం ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో ఎలా ముందుకెళ్లాలనే దానిపై సమావేశం ప్రధానంగా చర్చించనుంది. అదే సమయంలో 'మై నహీ, హమ్' (నేను కాదు, మేము) నినాదంతో ప్రధాని మోదీని ఢీ కొట్టేందుకు నడుం బిగించింది. ఆ దిశగా ఐక్యంగా ముందుకెళుతోంది. రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ చిత్తు కావడం, మోదీ హామీలపై నమ్మకంతోనే ప్రజలను తమను గెలిపించారని, 2024లోనూ తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని బీజేపీ ఊదరగొడుతున్న క్రమంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ప్రత్యామ్నాయ సానుకూల అజెండా సిద్ధం చేసుకోవడమే విపక్ష కూటమి ఎదురు ఉన్న పెద్ద సవాల్.

అయితే త్వరలో జరగబోయే సమావేశంలో సీట్ల సర్దుబాటుపై ప్రధానంగా చర్చ జరుగుతుం దని జైరాం రమేశ్ తెలిపారు. కీలక నేతలంతా అందుబాటులో ఉండే రోజున భేటీ జరుగుతుందన్నారు. సీట్ల సర్దుబాటు, ఉమ్మడిగా ఎన్నికల ర్యాలీల నిర్వహణతో పాటు సంయుక్త కార్యక్రమ ప్రణాళిక రూపొందించే దిశగా నేతలు సమాలోచనలు జరుపుతారు. మూడు కీలక రాష్ట్రాల్లో ఓటమితో లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపకం కాంగ్రెస్‌కు క్లిష్టంగా మారింది. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో కుల గణన, ఎంఎస్పీ చట్టం, కార్మికులకు సామాజిక భద్రత, పాత పింఛన్ పునరుద్ధరణ వంటి అంశాలు ఇండియా కూటమి ప్రచార అస్త్రాలవుతాయని, వీటికి తోడు పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, సామాజిక విభజన, రాజకీయ నిరంకుశత్వం, అధిక ద్రవ్యోల్బణం, దిగిరాని నిత్యావసరాల ధరలు వంటివి ఉంటాయని సీనియర్ నేత తెలిపారు. ఉమ్మడి అజెండా ప్రకారం కార్యచరణ ఉంటుందని వెల్లడించారు. మన్మోహన్ సింగ్ - మోదీ పదేళ్ల పాలన కాలంలోని పరిస్థితులను సామాన్యులకు పోల్చి చూపడం ద్వారా వారికి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అదానీ వ్యవహారం కూడా ప్రచారంలో వినిపిస్తుందని అన్నారు. ఈనెల 6న జరగాల్సిన సమావేశం కీలక నేతలు అందుబాటులో లేక కారణంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే.

జాతీయ విపత్తులుగా
తుపాను, కరువు నష్టాలు

- 14న జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నాలు జయప్రదం చేయండి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: రాష్ట్రంలో తుపాను, కరువు నష్టాలను జాతీయ విపత్తుగా పరిగణించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆది వారం అనంతపురంలోని వీకే ఆదినారాయణ రెడ్డి భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుపాను, కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ 26 జిల్లాల్లో ప్రతిపక్ష పార్టీలు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలతో సమావేశాలను నిర్వహిస్తామన్నారు. ఈ నెల 14వ తేదీన 26 జిల్లాల కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇటీవల సంభవించిన తుపాను, రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నెలకొన్న కరువు కారణంగా వేలాది ఎకరాలలో పంట నష్టపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులన్నీ గాలికి వదిలేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు కూడా అతి గతి లేకుండా పోయిందని జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నంతవరకు పోలవరం ప్రాజెక్టు పూర్తి కాదన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు కుదించారన్నారు. గోదావరి ప్రాజెక్టు 150 అడుగుల ఎత్తు కట్టి 136 టీఎంసీల నీరు నిల్వ చేయడం ద్వారా కృష్ణ, గోదావరి నదుల అనుసంధానం జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్రకు నీళ్ల వస్తాయని 960 మెగావాట్ల విద్యుత్‌చక్తి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కొలిక్కిరాని చర్చలు

- ఇంకా తేలని మధ్యప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమంత్రులు
- ఒకట్రెండు రోజుల్లో ప్రకటించేలా బీజేపీ కసరత్తు

న్యూదిల్లీ: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో విజయం సాధించింది. చత్తీస్‌గఢ్‌లో కొత్త ముఖ్యమంత్రిగా విష్ణుదేవ్ సాయ్‌ను ఆదివారం ప్రకటించింది. ఇక మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ముఖ్యమంత్రులు ఎవరన్నది తేల్చలేదు. దీనిపై మల్లగుల్లాలు పడుతూనే ఉంది. ఎన్నికల ఫలితాలు వెలువడి వారం దాటినాగానీ ఆ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులపై చర్చలు కొలిక్కి రాలేదు. అయితే మధ్యప్రదేశ్ సీఎంని సోమ వారం, రాజస్థాన్ ముఖ్యమంత్రిని మంగళవారం ప్రకటించే అవకాశాలున్నాయి. మధ్యప్రదేశ్, భోపాల్‌లో 163 మంది శాసనసభ్యులు ఈనెల 11న సమావేశమై కేంద్ర పరిశీలకుల సమక్షంలో తమ నాయకుడిని ఎనున్నకోనున్నారు. సోమ వారం సాయంత్రం 4 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని, రాత్రి 7గంటల సమయంలో ముఖ్యమంత్రి ఎవరన్న ప్రకటన వెలువడవచ్చని తెలుస్తోంది. 'పార్టీ పరిశీలకులైన హరియాణా సీఎం మనోహర్ లాల్ కట్టర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కె.లక్ష్మణ్, కార్యదర్శి ఆశా లక్రా ఉదయం 11 గంటలకు రాష్ట్రానికి చేరుకుంటారు. కొత్త ఎమ్మెల్యేలకు మధ్యాహ్నం

- మిగతా 2 లో

చత్తీస్‌గఢ్ సీఎంగా విష్ణుదేవ్ సాయ్

రమణ్‌సింగ్‌ను పక్కనపెట్టిన బీజేపీ అధిష్ఠానం

రాయ్‌పూర్: ఎట్టకేలకు బీజేపీ అధిష్ఠానం చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్‌ను ఎంపిక చేసింది. రాయ్‌పూర్‌లో జరిగిన బీజేపీ ఎమ్మె ల్యేల సమావేశంలో విష్ణుదేవ్‌ను బీజేపీ శాసన సభా పక్షనేతగా ఎన్నుకున్నారు. విష్ణుదేవ్‌సాయ్

- మిగతా 2 లో

కిక్కిరిసిన శ్రీశైలం ఘాట్ రోడ్డు

- 8కి.మీ మేర నిలిచిన వాహనాలు
- యాత్రికులకు తీవ్ర ఇబ్బందులు

విశాలాంధ్ర-శ్రీశైలం: కార్తీక మాసం సోమవారంతో ముగుస్తుండటంతో ప్రముఖ యాత్ర స్థలం శ్రీశైలానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఘాట్ రోడ్డులో సుమారుగా 8 కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ జామ్ కావడంతో యాత్రీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు పోలీసులు శ్రమిస్తున్నారు. మరోవైపు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శనానికి 8 గంటల టైము పడుతోంది. భక్తుల రద్దీ దృష్ట్యా స్వామి వారి స్పర్శ దర్శనాలు, అభిషేకాలను అధికారులు రద్దు చేశారు.

చిమ్మచీకట్లో శ్రీలంక

దేశవ్యాప్తంగా నిల్చిన విద్యుత్ సరఫరా

కొలంబో: ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంకకు విద్యుత్ సమస్య ఎదురైంది. సాంకేతిక సమస్య ఏర్పడటంతో దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనిపై శ్రీలంకలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వంటి వాటిని పర్యవేక్షించే సిలోన్ ఎలక్ట్రిసిటీ బోర్డు ప్రకటించింది. నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు సీఈబీ అధికార ప్రతినిధి వెల్లడించారు. కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో ఇంటర్నెట్ సేవలు స్తంభించాయి. కాట్‌మలే, బియగమా మధ్య మెయిన్ ఎలక్ట్రిక్ ఫీల్డ్ లైన్లలో సమస్య ఏర్పడిన కారణంగానే దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు ఇబ్బంది తలెత్తిందని అధికారులు పేర్కొన్నారు. 2022లో శ్రీలంకలో ఏర్పడిన తీవ్ర ఆర్థిక సంక్షోభంతో అక్కడి ప్రజల జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. శ్రీలంక వ్యాప్తంగా ఇంధనం, ఆహార పదార్థాలు, ఔషధాలు ఇలా అన్నింటికీ కొరత ఏర్పడింది. మరోవైపు విదేశీ మారక ద్రవ్య నిల్వలు అడుగంటిపోవడంతో ఇతర దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతోంది. కొన్ని రోజులుగా విద్యుత్ కోతలు సర్వ సాధారణమయ్యాయి. ఇప్పటికే శ్రీలంకలో రోజుకు 10 గంటల పాటు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. శ్రీలంక వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా ఆసుపత్రుల్లో రోగుల పరిస్థితి గందరగోళంగా మారింది.

ఇజ్రాయిల్ దాడులు తీవ్రతరం

జెరూసలేం: ఇజ్రాయిల్ హమాస్ మధ్య 63 రోజులుగా పోరు కొనసాగుతోంది. భూతల, వైమానిక దాడులతో ఇజ్రాయిల్ రక్త చరిత్ర సృష్టిస్తోంది. తాజాగా గాజాలో కాల్పుల విరమణ పాటించాలని ఐక్యరాజ్య సమితిలో తీర్మానాన్ని అమెరికా అడ్డుకున్న తర్వాత ఇజ్రాయిల్ దూకుడు పెంచింది. ఆదివారం దక్షిణ గాజాలోని ఖాన్ యునిస్ నుంచి ఈజిప్టు సరిహద్దుల్లోని రఫాకు వెళ్లే రహదారులపై దాడులు చేసింది. వేలాది మంది ప్రజలు నిలువు నీడలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గాజాలో పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. మానవతా సాయం అందక ఎంతో మంది ఆకలి, వ్యాధులతో చనిపోయే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సహాయక బృందాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఇజ్రాయిల్ దాడుల్లో 17,700 మంది పలస్తీనియన్లు చనిపోయినట్లు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. వీరిలో 40శాతం 18 ఏళ్లలోపు వారున్నట్లు పేర్కొంది.

విశాలాంధ్ర ప్రపంచం

ఆర్థిక పురోగతికి మరిన్ని చర్యలు: జిన్‌పింగ్

బీజింగ్: చైనా ఆర్థిక పురోగతికి మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ తెలిపారు. తమ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందని, అయితే అది కీలక దశలో ఉన్నదన్నారు. కోవిడ్ తర్వాత దేశీయ కార్యకలాపాలు మందగించడం, ఒడిదుడుకులను ఎదుర్కొవాల్సి రావడంతో ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడిందని తెలిపారు. మూడో త్రైమాసికంలో చైనా ఆర్థిక వ్యవస్థ 4.9శాతం మేరకు విస్తరించిందన్నారు. దేశంలో పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్నాయని, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రతికూలత పెరుగుతుండటం కూడా ఇందుకు దోహదమవుతోందని వెల్లడించారు. ఆధునిక పారిశ్రామిక వ్యవస్థ నిర్మాణాన్ని వేగిరపర్చడంపై దృష్టి పెట్టాలని, దేశీయ డిమాండ్‌ను విస్తరించాలని, శాస్త్రీయ సాంకేతిక రంగాల్లో స్వీయసమృద్ధి సాధన అవశ్యమని జిన్‌పింగ్ నొక్కిచెప్పారు.

ఇరాక్‌లో 14 మంది విద్యార్థుల సజీవ దహనం

బాగ్దాద్: ఇరాక్‌లోని సోరాన్ యూనివర్సిటీ హాస్టల్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. 14 మంది విద్యార్థులు సజీవ దహనం అయ్యారు. కొన్ని గంటల్లోనే మంటలను అదుపు చేసినప్పటికీ ప్రాణనష్టం జరిగింది. 18 మంది విద్యార్థులకు కాలిన గాయాలయ్యాయి. వీరిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు అందరూ గాయపడ్డారు.

ఆస్ట్రేలియాలో ఘోర ప్రమాదం: భారతీయుడి దుర్మరణం

మెల్బోర్న్: ఆస్ట్రేలియాలో ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో భారత్‌కు చెందిన ఖుష్‌దీప్ సింగ్ (26) దుర్మరణం చెందారు. శనివారం రాత్రి 11.15 గంటలకు మెల్‌బోర్న్, పామర్స్ రోడ్‌లో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కారు పల్టీలు కొట్టినట్లు తెలిసింది. సింగ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. సింగ్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, అలసట కారణంగా ఈ ప్రమాదం జరిగివుండవచ్చని ఆస్ట్రేలియా పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న సింగ్ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. అయితే తన భర్త మృతదేహాన్ని భారత్‌లోని ఆయన తల్లిదండ్రులకు చేర్చేందుకు సహకరించాలని సింగ్ భార్య జస్ప్రీత్ కౌర్ భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఖర్చుల కోసం ఆమె విరాళాలు సేకరిస్తున్నారు.

కార్పొరేషన్ చైర్మన్లపై వేటు

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్ల నియామకాలను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం 54 కార్పొరేషన్ల చైర్మన్ల నియామకాలు రద్దు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. డిసెంబరు 7న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన విషయం విదితమే. ఈ క్రమంలో గత ప్రభుత్వ హయాంలో నియమించిన కార్పొరేషన్ చైర్మన్లను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జాతీయ విపత్తులుగా తుపాను, కరువు నష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

వస్తుందన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, ఇరిగేషన్ రంగాలను నాశనం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం ఉన్నంతవరకు పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం లేదన్నారు. తెలంగాణలో ప్రగతి భవన్‌కు పట్టిన గతే రాబోయే ఎన్నికల్లో తాడేపల్లి భవనానికి కూడా పడుతుందని రామకృష్ణ హెచ్చరించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీశ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ వరద బాధితుల పరామర్శకు పరదాల చాటున వెళ్లడం చూస్తూ ఉంటే బాధితుల పట్ల ఆయనకున్న శ్రద్ధ అర్థమౌతోందన్నారు. కరువు, తుపాను నష్టాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో 31 మండలాలు ఉండగా 28 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారనీ, మిగిలిన మూడు మండలాలను కూడా కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంట నష్ట పరిహారం ఎక్కడా కూడా చెల్లించడం లేదన్నారు. పుట్టపర్తికి ముఖ్యమంత్రి వచ్చినప్పుడు పంట నష్ట పరిహారాన్ని చెల్లిస్తున్నట్లుగా బటన్ నొక్కే కార్యక్రమం చేసినప్పటికీ కూడా ఎవరి ఖాతాలోనూ నగదు పడలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన కిసాన్ పథకం ద్వారా నగదు పడినట్లు తెలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు పి.నారాయణస్వామి, సి.మల్లికార్జున, నగర కార్యదర్శి ఎస్.శ్రీరాములు, కేశవరెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో వణుకు

(మొదటిపేజీ తరువాయి)

లేదు. మరో నాలుగు నెలల్లో ప్రజాతీర్పును కోరేందుకు సీఎం జగన్ సిద్ధమవుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ఫలితాల నుంచి సీఎం జగన్‌కు అనేక సంకేతాలు, సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల్ని అమలు చేసినప్పటికీ, సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన లేకపోవడం తదితర కారణాలతో ఓటమి పాలైందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జగన్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎంత మేరకు ఆదుకుంటాయనే విషయంలో వైసీపీ నేతలు అయోమయంగా ఉన్నారు. జగన్‌పై సానుకూలంగా, ప్రతికూలంగా చూపే అంశాలు అనేకం ఉన్నాయి. జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, పోల్ మేనేజ్‌మెంట్, అభివృద్ధి పనులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో అసంతృప్తి, అధికార పక్షంలోని కొంత మంది ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకత, జగన్ వ్యవహార శైలిపై ప్రజలకు ఉన్న అభిప్రాయం, ప్రతిపక్ష టీడీపీ-జనసేన ఉమ్మడిగా పోటీ చేస్తే పడే ప్రభావం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరించే వ్యూహాలు కీలకంగా మారనున్నాయి. ప్రజా వ్యతిరేకత ఉన్న ఎమ్మెల్యేలను మార్చాల్సిందేనని వైసీపీకి సర్వే సంస్థలు సూచిస్తున్నట్లు సమాచారం. దీనిని దృష్టిలో ఉంచుకుని సీఎం దిద్దుబాటు చర్యల్లో నిమగ్నమయ్యారు. ఎన్నికల ముందు యువతను ఆకర్షించేందుకు హడావుడిగా గ్రూప్ 1, 2 నోటిఫికేషన్లు జారీజేయడం విమర్శలకు దారితీస్తోంది. అనంతరం ప్రజా వ్యతిరేకత ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేల మార్పుపై దృష్టి పెట్టినట్లు తెలిసింది. 2014 ఎన్నికల్లో వైసీపీ గెలుపు ధీమాతో అతిగా వ్యవహరించడంతోనే ఓటమి పాలైందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. దాంతోపాటు సమర్థులకు కాకుండా కార్పొరేటర్ స్థాయి వ్యక్తులకు ఎమ్మెల్యేలుగా టికెట్లు ఇవ్వడంతో ఆ పార్టీ పరాజయం పాలైందని, అనంతరం 2019లో అలాంటి పొరపాట్లను సరిదిద్దుకుని సమర్థులకే ఎమ్మెల్యే టికెట్లు కేటాయించడంతో అత్యధికంగా 151 స్థానాలను కైవసం చేసుకుందని అంటున్నారు. తాజాగా సర్వేలలో సీనియర్ మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలతోపాటు తొలిసారిగా ఎన్నికైన వారు ఓటమి పాలవుతారని వెల్లడైనట్లు ప్రచారముంది. రాబోయే ప్రాంతీయ సమన్వయకర్తల సమావేశంలో 30 మందికిపైగా సిట్టింగ్‌ల టికెట్లపై సీఎం జగన్ కీలక ప్రకటన చేసే అవకాశముంది.

కొలిక్కిరాని చర్చలు

(మొదటిపేజీ తరువాయి)

విందు ఏర్పాటు చేశారు. ఆపై సాయంత్రం 4 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తారు' అని ఓ ఎమ్మెల్యే చెప్పారు. ఇప్పటికే సీఎం ఎవరన్న నిర్ణయానికి ఎమ్మెల్యేలు వచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వాస్తవానికి ఈ సమావేశం ఆదివారమే జరగాల్సి ఉండగా పరిశీలకులకు తీరిక లేని కారణంగా సోమవారానికి వాయిదా వేశారు. అలాగే రాజస్థాన్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎవరన్నదీ బీజేపీ మంగళవారం ప్రకటించవచ్చని తెలుస్తోంది. ఇదే క్రమంలో జైపూర్‌లోని మాజీ సీఎం వసుంధర రాజే ఇంట్లో కొత్త, పాత ఎమ్మెల్యేలు భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ రాష్ట్రంలో 115 స్థానాలను బీజేపీ గెలుచుకుంది. ఇప్పటి వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరో ప్రకటించలేదు. ముఖ్యమంత్రిగా ఉండేదెవరో నిర్ణయించేందుకు ఎమ్మెల్యేలతో చర్చలు జరిపేందుకు పరిశీలకులను అధిష్ఠానం నియమించింది. ఎమ్మెల్యేల అభిప్రాయాలను తెలుసుకొని, పరిశీలకులు ఇచ్చే నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రి ఎంపిక జరుగుతుంది. అయితే ముఖ్యమంత్రుల ప్రకటనను బీజేపీ ఎప్పుడు ఆలస్యం చేసినాగానీ ఆ పదవిలో కొత్త వారిని పరిచయం చేస్తుంటుంది. ఈసారి ఛత్తీస్‌గఢ్‌లో అదే జరిగింది. దీంతో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లోనూ కొత్త వారే సీఎం పీఠంపై కనిపిస్తారన్న చర్చ జరుగుతోంది.

జగనన్న గోరుముద్ద పథకంలో

మెస్ చార్జీలు, కార్మికుల వేతనాలు పెంచాలి

ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ డిమాండ్

విశాలాంధ్ర-కడప బ్యూరో: రాష్ట్రంలో జగనన్న గోరుముద్ద పథకం మెస్ చార్జీలు పెంచి, ఈ పథకం కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.స్రవంతి, ఎం.రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని హోచిమిన్ భవన్‌లో జరిగిన సంఘం జనరల్ బాడీ సమావేశానికి యూనియన్ నాయకులు మోహన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన స్రవంతి, రమేష్ బాబు మాట్లాడుతూ రాజకీయ ప్రచారం కోసం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని జగనన్న గోరుముద్దగా పేరు మార్పు చేసిందేగానీ, మెనూకు సమానంగా మెస్ చార్జీలు పెంచలేదని విమర్శించారు. ఇది విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగపడక పోగా, కార్మికులపై పని భారం పెరిగిందన్నారు. అధిక వడ్డీలకు అప్పు తీసుకొచ్చి మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న కార్మికులకు కనీస వేతనంగా ప్రభుత్వం నెలకు రూ.3 వేలు చెల్లించడం దారుణమన్నారు. ఈ రెండు వేల రూపాయలు కూడా ఐదు సంవత్సరాల క్రితం పెంచినవేనన్నారు. కార్మికులకు న్యాయమైన జీతాలు చెల్లించేంత వరకు పోరాటం చేస్తామన్నారు. ప్రతినెలా మెనూ బిల్లును, వేతనం చెల్లించకపోతే కార్మికులు ఎలా తమ కుటుంబాలను పోషించుకుంటారని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కూళ్ల విలీనంతో విద్యార్థుల సంఖ్య తగ్గిందని చెప్పి ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. గ్యాస్, వంట పాత్రలు, నాణ్యమైన గుడ్లు, బియ్యం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులపై రాజకీయ వేధింపులు రోజురోజుకు ఎక్కువవుతున్నాయని, పని నుంచి నిలిపివేస్తామని బెదిరిస్తున్నారని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. నాలుగు సంవత్సరాలుగా పేద కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పోరాటాలు నిర్వహిస్తే అడ్డుకొని అక్రమంగా నిర్బంధించారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాగే మొండిగా వ్యవహరిస్తే ఆందోళన తప్పదని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చాంద్ బాషా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సి.బాదుల్లా, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి, యూనియన్ నాయకులు సులోచన, కామాక్షి, మేరీ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో ప్రజాస్వామ్య పాలన లేదు

- సంచలన వ్యాఖ్యలు చేసిన రిటైర్డ్ ఐఏఎస్‌లు
- వాడీవేడిగా సిటిజన్ ఫర్ డెమొక్రసి సమావేశం
- రాష్ట్రంలో బ్రిటీష్ పాలన సాగుతోందన్న వక్తలు

విశాలాంధ్ర-తిరుపతి: ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ,అప్రజాస్వామిక పాలనపై రిటైర్డ్ ఐఏఎస్‌లు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం తిరుపతిలో గంధమనేని శివయ్య భవనంలో సిటిజన్ ఫర్ డెమొక్రసీ (సీఎఫ్‌డీ) ఏర్పాటు చేసిన సదస్సులో సీఎఫ్‌డీ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ మాట్లాడుతూ... ఏపీలో రాజ్యాంగ బద్ధ పాలన సాగడం లేదన్నారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలన్నారు. తాజాగా తెలంగాణలో ఎన్నికైన ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఎన్నికలకు వాడుకోవడం సరైందికాదన్నారు. అలాగే ప్రభుత్వ సలహాదారులు గా 50 మందిని నియమించడం, వారందరూ రాజ్యాంగేతర శక్తులు గా వ్యవహరించడం దారుణం అన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ప్రతి పౌరుడు ప్రయత్నించాల న్నారు.రాజ్యాంగ పాలన జరగకపోతే ఎన్నో ప్రమాదాలు తలెత్తుతాయన్నారు. శ్రీలంకలో ఆదాయం కంటే ఖర్చు పెరిగిపోయిందని... అక్కడ పాలన చేతకాక ప్రజాప్రతినిధులు పారిపోయారని గుర్తు చేశారు.ప్రజాస్వామ్య స్ఫూర్తితో చర్చలు జరగాలన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అద్భుతం అని పునరుద్ఘాటించారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని క్షుణ్ణంగా చదివితే అందులోని విలువైన సందేశం అందరికీ అర్థమవుతుందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకుసాగితే భయపడాల్సిన అవసరం లేదన్నారు. మనం బ్రిటిష్ కాలంలో లేమని... ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రశ్నించేతత్వం అలవరుచుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి భవానీప్రసాద్ మాట్లాడుతూ సాంఘిక బాధ్యత, సామాజిక స్పృహ ప్రతి ఒక్కరికి అవసరం అన్నారు. ఏపీలో నెలకొన్న పరిస్థితులు ప్రజాస్వామ్య వాదులకు బాధ కలిగిస్తున్నాయన్నారు. హిమాచల్ ప్రదేశ్ మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎం.ఎస్.రావు ప్రసంగిస్తూ న్యాయవ్యవస్థపై చాలామందికి మంచి అభిప్రాయం లేదన్నారు. ఎమ్మెల్యేలు ఎంతమంది చదువుకున్న వారు ఉన్నారని ప్రశ్నించారు. చదువుకున్న వారు శాసనసభలో ఉంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏపీలో ప్రస్తుతం ముఖ్యమంత్రి చెప్పిందే చట్టంగా మారిపోతోందన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా బాగా పనిచేశారని గుర్తు చేశారు. మహిళలకు ప్రాధాన్యమిచ్చిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు.ఏది ఏమైనా ప్రజల్లో మార్పు అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మేధావి వర్గాలు, సంఘ సేవకులు భారీగా పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ సీఎంగా విష్ణుదేవ్ సాయ్

(మొదటిపేజీ తరువాయి)

గతంలో కేంద్రమంత్రిగా పనిచేశారు. 2020 వరకు బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. మాజీ సీఎం రమణ్‌సింగ్‌ను కాదని ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన విష్ణుదేవ్ సాయ్‌ను బీజేపీ అధిష్ఠానం సీఎంగా ఎంపిక చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సీఎం పదవి కోసం మాజీ సీఎం రమణ్‌సింగ్, రేణుకాసింగ్, అరుణా సావ్, విష్ణుదేవ్ సాయ్, ఓపీ చౌదరి పోటీ పడ్డారు. చివరకు ఎమ్మెల్యేలు విష్ణుదేవ్ సాయ్ వైపు మొగ్గు చూపడంతో బీజేపీ అధిష్ఠానం అతని పేరును ప్రకటిం చింది. ముగ్గురు కేంద్ర పరిశీలకుల పర్యవేక్షణలో కొత్త సీఎం ఎన్నిక జరిగింది. డిసెంబర్ 3న వెలువడిన ఛత్తీస్‌గఢ్ ఫలితాల తరువాత సీఎం ఎవరన్న దానిపై చర్చ నడుస్తూ వస్తోంది. బీజేపీ కేంద్ర నాయకత్వం నియమించిన పరిశీలకులు కేంద్ర మంత్రి అర్జున్ ముండా, సర్బానంద సోనోవాల్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్ గౌతమ్ సమక్షంలో శాసనసభా పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ సావ్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రమణ్ సింగ్ కూడా హాజరయ్యారు. వీరితోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 54 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అంతకుముందు ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా.. తాజాగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిం చింది. బీజేపీ గెలుపులో ఆదివాసీల పాత్ర ఎంతో ఉంది. ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్‌ను బీజేపీ ఓడించింది. అదే విధంగా బస్తర్‌లో 3 సీట్లు మినహా మిగిలిన అన్ని స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. దీంతో పాటు మైదాన ప్రాంతాల్లో బీజేపీ గెలుపులో ఓబీసీ ఓటర్లు కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా రాజస్థాన్ బీజేపీ శాసనసభా పక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నారు.

ర్యాగింగ్ నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రెండు నెలలుగా ఉన్నత విద్యాసంస్థల్లో కొనసాగుతున్న ర్యాగింగ్ నివారణకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌కు ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నరహరి ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో ర్యాగింగ్‌పై సమగ్ర విచారణ నిర్వహించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యా సంస్థలో ర్యాగింగ్ నివారణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి విద్యా సంస్థలో విద్యార్థి తల్లిదండ్రులు, యాజమాన్యాలు, కళాశాల సిబ్బందితో విద్యా కమిటీలు ఏర్పాటు చేయాలని, ఆ దిశగా ఉన్నతాధికారుల పర్యవేక్షణకు సత్వరమే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో ర్యాగింగ్ సంఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. కొద్దిరోజులుగా సీనియర్ విద్యార్థులు చేస్తున్న ర్యాగింగ్‌తో విసిగిపోయిన జూనియర్లు వారి తల్లిదండ్రులకు విషయాన్ని చేరవేశారని వివరించారు. ఈ ఫిర్యాదు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) వరకు వెళ్లినట్టు తెలుస్తోందన్నారు. నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వారి ర్యాంకుల ఆధారంగా వైద్య కళాశాలల్లో సీట్లు కేటాయిస్తారని, ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చి కళాశాలలో చేరిన విద్యార్థులను హాస్టళ్లలో సీనియర్లు ర్యాగింగ్ చేస్తున్నారని, సీనియర్లు కొంతమంది తమ రికార్డులను జూనియర్లకు ఇచ్చి రాయిస్తున్నారని తెలిపారు. తమ రికార్డులతో పాటు సీనియర్ల రికార్డులు రాయడంతో జూనియర్లు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని, మర్నాడు తరగతులకు వెళ్లడం లేదని, నిత్యం ఇదే పనిగా ఉండడంతో భరించలేని కొంతమంది జూనియర్లు తల్లిదండ్రులకు ఫోన్ చేసి ర్యాగింగ్‌పై వివరించారన్నారు. కొంతమంది తల్లిదండ్రులు ఎంసీఐకి ఫిర్యాదు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసిందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు కౌన్సిల్ మెయిల్ పంపినట్టు సమాచారం ఉందని, అయితే ఈ విషయాన్ని కళాశాల వర్గాలు చాలా గోప్యంగా ఉంచుతున్నాయని వివరించారు. తక్షణమే సీఎం జగన్ స్పందించి ర్యాగింగ్ సంఘటనలపై విచారణకు ఆదేశించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

'కట్టమంచి' సాహితీ సేవ ఉన్నతం

విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో వక్తలు

విశాలాంధ్ర-విశాఖ: ఆధునిక సాహిత్య విమర్శ ప్రస్థానంలో విప్లవాత్మకంగా, తెలుగు సాహిత్య విమర్శను రాబోయే తరాలవారికి అందుబాటులోకి వచ్చేలా సాహిత్య రంగంలో సరికొత్త భావాలకు, నూతన ఆలోచనారీతులకు మనోవికాసాత్మకమైన విమర్శలకు కట్టమంచి రామలింగారెడ్డి దోహదపడ్డరని వక్తలు ఉద్ఘాటించారు. విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం అరసం, ఆచార్య చందు సుబ్బారావు సాహిత్య, సాంస్కృతిక ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి సాహిత్యం-విమర్శ అంశంపై జరిగిన సాహిత్య సభలో ఆచార్య కె.ఎస్.చలం, ఆచార్య చందు సుబ్బారావు, ఆచార్య వెలమల సిమ్మన్న పాల్గొని మాట్లాడారు. ఒకవైపు తెలుగు కవితను, మరోవైపు కవితా విమర్శను నూతన శోభతో కొత్తకాంతులతో ఆవిష్కరించిన సాహితీమూర్తి కట్టమంచి అని, సంభాషణలతో దెబ్బకు దెబ్బ తీయగల నేర్పు, వాదనా చాతుర్యం ఆయన శైలి అని అన్నారు. హాస్య ప్రియత్వం, ఛలోక్తులు, చమత్కార సంభాషణా నైపుణ్యం వంటి లక్షణాలతో అందరినీ ఆకట్టుకునేవారు రామలింగారెడ్డి అని కొనియాడారు. సాహితీవేత్తగా, వక్తగా, విమర్శకుడిగా, విద్యావేత్తగా, రాజనీతిజ్ఞుడిగా అనేక రంగాల్లో తెలుగునాట తనదైన ముద్రవేశారని గుర్తు చేశారు. శత వసంతాల తెలుగు సాహిత్య ప్రస్థానం గురించి ఆలోచించేటప్పుడు మొట్టమొదటగా మనసులో మెదిలే కొద్దిమంది వైతాళికుల్లో కట్టమంచి రామలింగారెడ్డి ఒకరని తెలిపారు. ఆంధ్రా విశ్వవిద్యాలయాన్ని విశాఖలో నెలకొల్పడంలో కట్టమంచి విశేష కృషి చేశారని అన్నారు. ఆచార్య కె.ఎస్.చలం రచించిన 'వలస' నాటకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మేనేజర్ పి.ఎ.రాజు, బండి సత్యనారాయణ, అడపా రామకృష్ణ, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తేదారులకు ప్రభుత్వ చెల్లింపులేవి ?

పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గుత్తేదారులకు ప్రభుత్వం చెల్లింపులు చేపట్టకుండా తమని బాధ్యుల్ని చేస్తోందని, రెగ్యులర్‌గా చెల్లింపులు జరిగితేనే పనులు చేయుగలమని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ల సంఘం స్పష్టం చేసింది. తమ ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఇంజినీర్లు హెచ్చరించారు. విజయవాడలో ఆదివారం పంచాయతీరాజ్ ఇంజినీర్ల రాష్ట్రస్థాయి సంఘ సమావేశం జరిగింది. దీనికి సంఘ అధ్యక్షుడు మురళీకృష్ణ నాయుడు, ప్రధాన కార్యదర్శి సంగీతరావు హాజరయ్యారు. 2019లో ప్రభుత్వం రూ. 12వేల కోట్ల విలువైన 40వేల భవనాలను ఒకేసారి మంజూరు చేసిందని, దశల వారీగా చేపట్టాలని సూచించినా వినకుండా ఐదేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం విధించిందన్నారు. కరోనా మూలంగా రెండేళ్ల తర్వాత 2021లో పనులు ప్రారంభించి, ఇప్పటికి వరకు 50 శాతం పనులు పూర్తి చేశామని వివరించారు. ఇప్పుడు నాలుగేళ్లలో చేయాల్సిన పనులను నాలుగు నెలల్లో పూర్తి చేయాలని తమపై ఒత్తిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజినీర్లపై కొందరు జిల్లా కలెక్టర్లు చర్యలకు ఉపక్రమించారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

2024 ఎన్నికలు దేశానికి అత్యంత కీలకం

అందరం ఏకమై మోదీని గద్దె దింపుదాం

సీపీఐ అనంతపురం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో రామకృష్ణ

విశాలాంధ్ర-అనంతపురం: 2024 సార్వత్రిక ఎన్నికల్లో దేశానికి అత్యంత కీలకమనీ, నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి దేశవ్యాప్తంగా లౌకిక శక్తులు ఏకమై సమన్వయంతో ముందుకెళ్లాలనీ, ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ పెద్దన్న పాత్ర పోషించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె. రామకృష్ణ చెప్పారు. సీపీఐ అనంతపురం జిల్లా విస్తృతస్థాయి సమావేశం వీకే మెమోరియల్ హాల్లో ఆదివారం జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ దేశాన్ని ఆదాని, అంబానీలకు అప్పజెప్పి కార్పొరేట్ శక్తుల సహకారంతో ప్రభుత్వాలను ఏర్పాటు చేయడానికి బీజేపీ కుట్రపూరిత రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పదేళ్ల కిందట అధికారంలోకి రావడానికి చేసిన వాగ్దానాలు అమలు చేయడంలో మోదీ విఫలమయ్యాడన్నారు. నల్లధనం రప్పించి ప్రజలకు పంచుతామని, ఉద్యోగాల కల్పన చేపడతామని, నూతన పారిశ్రామిక వాడలు నెలకొల్పుతామని , నిత్యావసర ధరలు తగ్గిస్తామని ప్రజలను నమ్మబలికారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ ప్రజలను మరింత పేదరికంలోకి నెట్టిందన్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో తెలంగాణ మినహా మిగిలిన రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ తప్పిదాలే కారణం అన్నారు. ఇండియా కూటమి అని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ పార్టీ ఉత్తరాది రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలను కలుపుకుపోవడానికి ముందుకు రాలేదన్నారు. ఈ ఓటమితోనైనా గుణపాఠం నేర్చుకొని దేశంలోని 28 రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలనీ, లౌకిక పార్టీలన్నీ ఒక వేదికపైకి వస్తే తప్ప నరేంద్ర మోదీని గద్దె దింప లేమన్నారు. దేశవ్యాప్తంగా 15 శాతం ఉన్న ముస్లింలకు ఎక్కడా కూడా బీజేపీలో స్థానం లేదని , ఒక ఎమ్మెల్యే , ఎంపీ సీటు ఎక్కడా ఇవ్వలేదన్నారు. ఎన్డీయే మరోసారి అధికారంలోకి వస్తే విద్యా కాషాయీకరణ పేరుతో యూనివర్సిటీలను కలుషితం చేస్తారని, పాఠ్యాం శాలను కాషాయీకరణ చేస్తారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను తన ఆదాయ వనరుగా మార్చుకున్నాడని , ఏకపక్ష వ్యవహార శైలితో అన్ని వర్గాల ప్రజలు నష్టపోతున్నారన్నారు. ఏపీలో 18 జిల్లాల్లో కరువు వస్తే, కనీసం కేంద్ర బృందాన్ని రప్పించి పంటల పరిశీలన చేయడానికి తీరిక లేకుండా పోయిందన్నారు. కరువు, తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోతే కనీసం వాటికి మరమ్మతులు చేపట్టడానికి కూడా జగన్‌కి తీరిక లేకుండా పోయిందన్నారు.. రాష్ట్రానికి జీవనాడిగా ఉన్న పోలవరం ఎత్తు తగ్గించడానికి జగన్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని, ఇదే జరిగితే ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మరో మూడు నెలల్లో జరుగుతున్న ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెపుతారన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి. జగదీశ్, అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి మల్లికార్జున జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సంజీవప్ప నియోజకవర్గ కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజమండ్రి విమానాశ్రయ నూతన టెర్మినల్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర - సీతానగరం/రాజానగరం: కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆదివారం రాజమహేంద్రవరం విమానాశ్రయం నూతన టెర్మినల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.350 కోట్లతో ఈ టెర్మినల్ నిర్మాణం జరగనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ మార్గాని భరత్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జిల్లా కలెక్టర్ మాధవి లత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1224 ఎకరాలలో సుమారు 70 లక్షల జనాభాకు ఉపయోగపడే విధంగా ఎయిర్పోర్ట్ అభివృద్ధిలో భాగంగా టెర్మినల్ నూతన భవన నిర్మాణానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాజమహేంద్రవరం చుట్టు పక్కల ప్రాంతాలు పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని, ఈ ప్రాంతంలో కార్గో సర్వీసులతో పాటు మరికొన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తే తూర్పు గోదవరి జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను వల్ల రాష్ట్రంలో చాలామంది రైతులు పంట చేతికందే సమయంలో తీవ్రంగా నష్ట పోయారని, రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటున్నప్పటికీ పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినందున కేంద్ర ప్రభుత్వం కూడా తనవంతు రైతులను ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, గోపాలపురం ఎమ్మెల్లే తలారి వెంకట్రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, విమానయాన అధికారులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మబోమని కేంద్రం ప్రకటించాలి

శ్రీనివాసరావు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ పట్నం ఉక్కు కర్మాగారాన్ని అమ్మేస్తామని కేంద్రప్రభుత్వం చెబుతంటే బీజేపీ ఎంపీ జీవీఎల్ మాత్రం అమ్మడం లేదంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఇటువంటి నాటకాలను, ప్రజలను మోసం చేసే చర్యలు మానుకోవాలని బీజేపీ నేతలకు సూచించారు. ఉక్కు కర్మాగారాన్ని అమ్మడం లేదని కేంద్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జగదాంబ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం ఉత్తరాంధ్ర ప్రజలు వెయ్యి రోజులుగా పోరాడుతుంటే దాన్ని పట్టించుకోకుండా ప్రవేట్ జపం చేయడం తగదన్నారు. విశాఖ నుంచి పోటీ చేయాలనీ బీజేపీ సిద్ధపడుతోందని, ఆ పార్టీని ఓడించాలని, లేకపోతే ఆంధ్ర రాష్ట్రాన్నే నాశనం చేస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. విశాఖ రైల్వేజోన్ పనులు ప్రారంభించకపోవడానికి స్థలం లేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. విశాఖ పోర్టు, స్టీల్, రైల్వే భూములను కారుచౌకగా ప్రవేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన మిచౌంగ్ తుపాను వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు. రాష్ట్రానికి రూ. 10వేల కోట్లు నష్టపరిహారాన్ని కేంద్రం ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం పాల్గొన్నారు.

రాయలసీమ వెనుకబాటుకు పాలకుల వైఫల్యమే కారణం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు

విశాలాంధ్ర-తిరుపతి: రాయలసీమ ప్రాంతం తరచూ కరువు బారిన పడటానికి, వెనుకబాటుకు పాలకుల వైఫల్యమే కారణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు విమర్శించారు. ఆదివారం తిరుపతి యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో 'రాయలసీమ అభివృద్ధి-సమస్యలు' అనే అంశంపై చర్చా గోష్టి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగింది. రాజకీయ పార్టీల నాయకులు ముఖ్య అతిధులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ రాయలసీమ వెనుకబాటుకు మూడు కారణాలు ఉన్నాయని, అందులో ప్రధానంగా పాలకుల నిర్లక్ష్యం, ప్రకృతి వైపరీత్యాలు, ప్రజల మధ్య అనైక్యత అని స్పష్టం చేశారు. రాయలసీమకు ఈశాన్య రుతుపవనాలు రానందువల్ల తరచూ కరువు బారిన పడుతోందని తెలిపారు. 1983లో ప్రారంభించిన ప్రాజెక్టులు ఏ ఒక్కటీ నేటికీ పూర్తి కాలేదని, నీళ్లు ఉండి కూడా పంట పొలాలకు ఇచ్చుకోలేని దయనీయస్థితి రావడానికి ఈ తరహా నిర్లక్ష్యం శ్రీబాగ్ ఒడంబడిక నుంచి కొనసాగుతోందని విమర్శించారు. ఆంధ్ర రాష్ట్రం, ఆంధ్ర ప్రదేశ్, ఇప్పుడు నవ్యాంధ్రప్రదేశ్ పేర్లు మారాయే తప్ప పాలకులు మాత్రం నిర్లక్ష్యం వీడటం లేదని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. దీనిని అరికట్టేందుకు ప్రజలంతా సమైక్యంగా పోరాడాలని సూచించారు. కావేరి జలాల విషయంలో కర్నాటక, తమిళనాడులోని అన్ని రాజకీయ పార్టీలు వారి వారి ప్రయోజనాల కోసం గట్టిగా పోరాడతాయని అన్నారు. అయితే ఏపీలో పాలకవర్గ పార్టీలు ప్రజలను కులాల వారీగా విభజించి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. వాస్తవానికి రాయలసీమలో సారవంతమైన నల్లరేగడి నేలలు, ఎర్రరేగడ భూములు, కష్టపడి పని చేసే మానవ సంపద కూడా ఉందన్నారు. అభివృద్ధిని కోరుకునే పాలకులు ఎవరైనా దీనిని సద్వినియోగం చేసుకోవాలని, అయితే దానికి భిన్నంగా జరుగుతోందని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి, వ్యవసాయానికి నీరు, విద్యుత్ కావాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగడానికి పారిశ్రామిక అభివృద్ధి అవసరమని స్పష్టం చేశారు. పరిశ్రమలు పెట్టడానికి కావలసిన ముడిసరుకు, అవసరమైన ఖనిజ నిక్షేపాలు రాయలసీమలో అపారంగా ఉన్నాయన్నారు. బనగానపల్లి నుంచి కడప వరకు, తాడిపత్రి నుంచి కమలాపురం వరకు ఉన్న ప్రాంతాలలో లైమ్ స్టోన్ భూమి పైపొరల్లో విస్తారంగా దొరుకుతుందన్నారు. 200 సంవత్సరాలకు కావలసిన నాపరాయి నిక్షేపాలు ఉన్నాయని, వాటి ఆధారంగా మరో 150 సిమెంట్ పరిశ్రమలు పెట్టవచ్చన్నారు. అయినా పాలకులు ఆ దిశగా దృష్టి సారించడం లేదని విమర్శించారు. అందువల్ల ప్రజలు ఉద్యమించి, రానున్న ఎన్నికల్లో ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి, విద్యా, వైద్య, రవాణా రంగాలను అభివృద్ధి చేస్తామని తమ ఎన్నికల ప్రణాళికలో వైసీపీ, టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలు పెట్టేలా ఒత్తిడి తీసుకురావాలన్నారు. కమ్యూనిస్టు పార్టీలు నిరంతరం దీనికోసమే 70 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ నేటి వైసీపీ ప్రభుత్వానికి రాయలసీమ అభివృద్ధిపై, ప్రత్యేక హోదాపై, అమరావతి రాజధానిపై కనీస అవగాహన కూడా లేకపోవడం వల్లే ఈ రాష్ట్రానికి ఇలాంటి దౌర్భాగ్యం పట్టింద న్నారు. ఇప్పుడున్న పార్టీలైనా రాయలసీమ సమగ్రాభివృద్ధి కోసం కమ్యూనిస్టులు చేపడుతున్న పోరాటాలలో భాగస్వాములు కావాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎస్.తులసి రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ నీటి సమస్యలను, కరువు పరిస్థితులను మ్యాపు ద్వారా సమగ్రంగా వివరించారు. కర్నాటక నుంచి రాయలసీమ మీదుగా ఆంధ్ర ప్రదేశ్‌కు రావలసిన నీటి వాటాలపై బ్రిజేష్ ట్రిబ్యునల్ చెప్పిన అంశాలను పేర్కొంటూ, రాయలసీమలో కరువు, వెనుకబాటుతనంపై అవగాహన లేని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వల్లే సమస్య మరింత తీవ్రమవుతోందని తెలిపారు. అందుకోసమే మూడు రాజధానులు అనే పేరుని తెరపైకి తీసుకువస్తున్నాడని మండిపడ్డారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ హరిప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కె.రాధాకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, కందారపు మురళి, కాంగ్రెస్ నాయకులు రాంభూపాల్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, టీడీపీ నాయకులు జి.నరసింహ యాదవ్, వూకా విజయ్ కుమార్, డాక్టర్ సుధాకర్ రెడ్డి, జనసేన నాయకుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన అపవిత్ర కలయిక : అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ, జనసేన పార్టీలది అపవిత్ర కలయికని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ఏపీలో కలిసి ఎందుకు పోటీ చేస్తున్నారు? తెలంగాణలో ఎందుకు కలిసి పోటీ చేయలేదో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. ఎందరు కలిసినా జగన్ మళ్లీ సీఎం అవడం తథ్యమని విశ్వాసం వ్యక్తం చేశారు. జగన్‌పై చంద్రబాబుతోపాటు ఆయన అనుకూల వర్గాలు దుష్ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో తుపాను బాధితులకు మాజీ సీఎం చంద్రబాబు కంటే ఎక్కువ పరిహారం ఇవ్వడమే కాకుండా సహాయ సహకారాలను మెరుగైన విధంగా అందిస్తూ వారికి జగన్ అండగా నిలిచారని అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాజెక్టులకు నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంఖుస్థాపనలు చేయగా, వాటిని పూర్తి చేసేందుకు జగన్ పూనుకున్నారని అంబటి చెప్పారు. వెలిగొండ టన్నెల్ త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. టీడీపీ అలసత్వం వల్లే గుండ్లకమ్మ ప్రాజెక్టుకు దుస్థితి నెలకొందన్నారు. టీడీపీ హయాంలో గుండ్లకమ్మకు రూ.5కోట్లు ఖర్చుచేసి మొక్కుబడిగా మరమ్మతులు చేశారని విమర్శించారు. మరమ్మతులు సరిగ్గా చేసి ఉంటే నేడు ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్‌కు ఇక్కడ ఇళ్లు, చిరునామాలు లేవని, ఎప్పటికప్పుడు రాష్ట్రానికి వచ్చి రాజకీయం చేసి ఫ్లైట్ ఎక్కి వెళ్లిపోతారని విమర్శించారు. తెలంగాణలో ఎనిమిది చోట్ల పోటీ చేస్తే జనసేనకు ఒక్క చోటే డిపాజిట్లు వచ్చాయని గుర్తుచేశారు. మిగిలిన చోట్ల బర్రెలక్కకు వచ్చినన్ని ఓట్లు రాలేదన్నారు. తన సభలకు జనం వస్తారు కానీ ఓట్లు వేయరనే విషయాన్ని పవన్ గ్రహించాలని చెప్పారు. తెలంగాణలో ఏ ప్రభుత్వం వచ్చినా, పోయినా తమకు ఎలాంటి ఆసక్తిలేదని, అక్కడ తమ పార్టీ లేదని, ఏపీలో మళ్లీ వైసీపీ ప్రభుత్వమే ఏర్పడుతుందని అంబటి రాంబాబు తెలిపారు.

నాగార్జునకొండకు అమెరికా బౌద్ధ పరిశోధకులు

చరిత్ర వివరించిన పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

విశాలాంధ్ర-నాగార్జునసాగర్: అమెరికాలో స్థిరపడి బౌద్ధంపై పరిశోధనలు చేస్తున్న ప్రవాస భారతీయులు భాస్కర్, తలాటం శ్రీనగేష్ బౌద్ధ కేంద్రాల సందర్శనలో భాగంగా ప్రపంచంలోనే రెండో ఆర్కిలాజికల్ ఐలాండ్ మ్యూజియం నాగార్జున కొండను ఆదివారం సందర్శించారని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. వీరికి నాగార్జున కొండ మ్యూజియం క్యూరేటర్ కమలహాసన్ స్వాగతం పలికారు. అనంతరం మ్యూజియంలోని బౌద్ధ శిల్పాలు, శాసనాలు, పురావస్తు వస్తువుల గురించి, ఇక్ష్వాకుల కాలంలో శ్రీ పర్వత విజయపురిగా పిలువబడిన నాగార్జున కొండ చారిత్రక విశేషాలను వివరించారు. అలాగే, నాగార్జున కొండపై పునర్నిర్మించిన క్రీస్తు శకం 3వ శతాబ్దం నాటి అశ్వమేధ యాగశాల, సింహల విహారం, మహాస్థూపం, చైత్యము, మధ్య యుగపు జైన దేవాలయాలు, ఇనుప యుగపు సమాధి, రెడ్డి రాజులు నిర్మించిన కోట అవశేషాలను శివనాగిరెడ్డి అమెరికా బౌద్ధ పరిశోధకులకు వివరించారు. నాగార్జునకొండకు సంబంధించిన బౌద్ధ శిల్పాలు న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియంలో ప్రత్యేక ప్రదర్శనలో ఉన్నాయని, వాటిని తాము చూసిన తర్వాత నాగార్జున కొండను చూడాలనిపించి ఇక్కడకు వచ్చినట్లుగా మహాయాన బౌద్ధ పరిశోధకుడు భాస్కర్, జైన బౌద్ధ పరిశోధకుడు తలాటం శ్రీనగేష్ తెలిపారని శివనాగిరెడ్డి అన్నారు.

ఆదర్శనీయం దత్తు జీవితం

30వ వర్ధంతి సభలో జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): ప్రజాదరణ నేత దోనేపూడి దత్తు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. దోనేపూడి దత్తు స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో దాసరి భవన్‌లో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన దోనేపూడి దత్తు 30వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జల్లి విల్సన్ పాల్గొని దత్తు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విల్సన్ మాట్లాడుతూ దివి తాలూకాలో, ఉమ్మడి కృష్ణాజిల్లాలో దత్తు కార్యదర్శిగా ఉంటూ కమ్యూనిస్టు ఉద్యమానికి బాసటగా నిలిచార న్నారు. ఆరోజు ఉద్యమంలో ఎందరో అమరులయ్యారన్నారు. దత్తు కార్యకర్తలకు అండగా ఉంటూ ఉద్యమ బాటలో నిలిచి కమ్యూనిస్టు పార్టీని నిర్మాణానికి తోడ్పడ్డారని పేర్కొన్నారు. చంద్ర రాజేశ్వర రావు లాంటి మహానుభావులతో కలిసి పనిచేసిన ఘనత దత్తుకే దక్కిందన్నారు. దాదాపు 30 సంవత్సరాలుగా దత్తు ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు కొనసాగించటం, దత్తు ఆశయాల కొనసాగింపేనన్నారు. ట్రస్టు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ రాజకీయాలలో మార్పులు వస్తున్నాయన్నారు. దోనేపూడి దత్తు జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. ప్రస్తుతం రాజకీయాలలో డబ్బు, నేరాలు పెరిగాయన్నారు. నాడు కమ్యూనిస్టు పార్టీలో మహనీయుల పాత్ర కీలకంగా ఉందని, దత్తు లాంటి ఆదర్శ నాయకుల వర్ధంతి కార్యక్రమాల ద్వారా యువకులు, విద్యార్థులు, మహిళలలో చైతన్యం నిర్మాణాత్మక కృషి ఉండాలన్నారు. త్యాగము నిబద్ధత నిజాయితీ తో ఉంటే ప్రజలలో ఆదరణ పెరుగుతుందని, అప్పుడే కమ్యూనిస్టు పార్టీ నిర్మాణాభివృద్ధి చెందుతుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ కోటేశ్వరావు మాట్లాడుతూ దత్తు నాయకత్వంలో జరిగిన పోరాటాల ఫలితంగా అనేక మందికి భూములు దక్కా యన్నారు. దత్తు వారసులంగా మనం వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కమ్యూనిస్టుగా తీర్చిదిద్దుకోవటంలో రాష్ట్రంలో దత్తునే ప్రథమ స్థానంలో ఉంటారన్నారు. పోరాట నైపుణ్యంతోనే చల్లపల్లి జమీందారుల ఉద్యమం విజయ వంతమైందని కొనియాడారు. ఇలాంటి మహానుభావులను మనమంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

సీపీఐ సీనియర్ నాయకులు పాత్రు వెంకటేశ్వరరావుకు దత్తు ట్రస్ట్ తరపున చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నార్ల వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, జిల్లా నాయకులు చెరుకు శ్రీనివాస్, దత్తు స్మారక ట్రస్ట్ కార్యదర్శి కొండపల్లి మాధవరావు, మహిళా సమాఖ్య నాయకులు ఓర్సు భారతి, నక్క రాజ్యలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా, నగర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీచర్లకు ఆయూష్‌పై అవగాహన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆయుష్ విభాగం ఆదివారం విజయవాడ లోని ఓ హోటల్లో అధ్యాపకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎస్‌పీ రాజేంద్ర కుమార్ హాజరయ్యారు. రాష్ట్రంలోని ప్రభుత్వవైద్య కళాశాలలు, ఆసుపత్రులు, ఆయుర్వేద, హోమియోపతి, అల్లోపతి వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వైద్యసేవలపై అవగాహనకు ఈ కార్యక్రమం దోహదమైందన్నారు. ఆయూష్ విభాగానికి సంబంధించి గుడివాడ, కడప, రాజమహేంద్రవరం, విజయవాడలలో ఆసుపత్రుల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్‌లో దీర్ఘకాలిక రోగాలకు వైద్యం స్థానికంగానే అందుబాటులో ఉంటుందని, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. మైగ్రేన్, సైనాటిస్, పక్షవాతం వంటి రోగాలు నయమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఆయూష్ అధికారులు డాక్టర్ ఆర్.వెంకటకృష్ణ, ఎ.భుజంగరావు, 26 జిల్లాల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఘాతుకం

విశాలాంధ్ర-చింతూరు (అల్లూరి జిల్లా): చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా చోతేడోంగర్ గ్రామస్తుడిని మావోయిస్టులు గొడ్డలితో నరికి చంపారు. మృతుడుని చోతేడోంగర్ గ్రామంలో పేరు పొందిన నాటు వైద్యుడి మేనల్లుడు కోమల్ మంఝు అని పోలీసులు గుర్తించారు. మంఝు తన మేనమామతో కలిసి ఆలయంలో పూజలు చేసి ఇంటికి వస్తుండగా ఈ దాడి జరిగింది. వీరిద్దరికీ గతంలో చంపుతామని బెదిరింపులు కూడా వచ్చాయని పోలీసు ఉన్నతాధికారి చెప్పారు. గత నెల అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు చెందిన కొంతమందిని నారాయణ్‌పూర్ జిల్లా కేంద్రానికి తరలించి భద్రత కల్పించారు. వారిలో వీరిద్దరు ఉన్నారు. రెండవ దశ పోలింగ్ పూర్తయిన తర్వాత వీరిద్దరూ తమ గ్రామానికి తిరిగి వచ్చేశారు. తమకు ఇక రక్షణ అవసరం లేదని వారు తిరస్కరించారని పోలీసు అధికారి తెలిపారు. మంఝు హత్య సంగతి తెలియగానే పోలీసు బృందం ఆ ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం ఆస్పత్రికి తరలించారు. హత్య జరిగిన చోట మావోయిస్టుల చేతిరాత కాగితం దొరికింది. మంఝు అందాయి ఘాటి ఇనుప ఖనిజం గని ఏజెంట్‌గా పని చేస్తున్నాడని, భారీగా డబ్బు సంపాదిస్తున్నాడని అందులో ఉంది. మావోయిస్టుల కోసం ఆ ప్రాంతంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యారంగాన్ని కాపాడుకుందాం

జాన్సన్ బాబు పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): రాష్ట్రంలో విద్యా రంగాన్ని కాపాడుకుందామని ఏఐఎస్ఎఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు పిలుపునిచ్చారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సమితి కోశాధికారి మందగళ్ల సాయికుమార్ అధ్యక్షతన 28వ మహాసభ విజయవాడ శాఖ అధ్వర్యంలో ఆదివారం దాసరిభవన్‌లో జరిగింది. జాన్సన్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం భగత్ సింగ్, చే గువేరా, అల్లూరి స్ఫూర్తితో నాయకులు పోరాడారని ఆయనన్నారు. నూతన విద్యా విధానం పేరుతో ఎన్‌సీఈఆర్టీ సిలబస్ నుంచి మొఘల్ చరిత్ర, భగత్ సింగ్, గాంధీజీ చరిత్ర, డార్విన్ సిద్ధాంతాలను తొలగించి, రామాయణం, జ్యోతిష్యం, భగవద్గీత, వాస్తు వంటి అశాస్త్రీయ పాఠ్యాంశాలు చొప్పిస్తున్న కేంద్రప్రభుత్వ తీరు ఆక్షేపణీయమని అన్నారు. రాష్ట్రంలోనూ ప్రాథమిక విద్యను ఉన్నత విద్యలో విలీనం చేయడం, ఎయిడెడ్ విద్యాసంస్థల రద్దు, మాతృభాషలో విద్యా బోధన లేకుండా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం వంటివి జరుగుతున్నాయని, వీటిని తీవ్రంగా ఖండిస్తున్నామని జాన్సన్ బాబు అన్నారు. శాస్త్రీయ విద్యా విధానం అమలు చేయాలని, విద్యా ప్రైవేటీకరణ- వ్యాపారాన్ని అరికట్టాలని, కేజీ నుంచి పీజీ వరకు అందరికీ ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు. అలాగే టీచర్ల పోస్టుల భర్తీ, కళాశాలల స్థాయిలో విద్యార్థి సంఘాలకు ఎన్నికల నిర్వహణ, ర్యాగింగ్ కట్టడి, ప్రైవేట్ రంగ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలు కోసం జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పూర్వ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. కోశాధికారి సాయి కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో సాగుతున్న వ్యాపార ధోరణి అరికట్టాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నిర్మాణపరమైన కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగర శాఖ మహాసభకు హాజరైన వివిధ కళాశాలల విద్యార్థులకు అభినందనలు తెలిపారు. తొలుత పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అయ్యప్ప, జగదీశ్, రంజిత్, సుధీర్, సురేశ్, అభిషేక్ పాల్గొన్నారు.

సామాజిక అవలోకనమే సాహిత్యానికి ఊపిరి

కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, 9948774243

అక్షరమూ మరణించినట్లే, జీవన కాంక్షతో కూడిన అస్తిత్వాన్ని కోల్పోయినప్పుడు, కదిలే కాలానికి ధీటుగా దార్శనిక శక్తితో వ్యవస్థకు వెలుగుల దారి చూపించలేక పోయినప్పుడు. కాల గమనంలో జీవన ప్రమాణాలు ఎంతవరకు మెరుగుపడుతున్నాయో యోచించే ఆలోచనలకు సజీవ శక్తినివ్వలేని సాహిత్యం మరుగునపడిపోతుంది. సాహిత్య ప్రయోజనం పాఠక హృదయాల్ని కదిలించాలి. వారి మస్తకంలో నూతన ఆలోచనల్ని రేకెత్తించాలి. సాహిత్యం లోకరీతిని, నీతిని లోచూపుతో చూసే అపూర్వమైన దృష్టి కోణం కలిగి ఉండాలి.

20 వ శతాబ్దం నుండే ప్రపంచీకరణ ఫలితాలు ప్రపంచమంతా విస్తరించి, బతుకులో వేగాన్ని, జీవిత నమూనాను, వస్తు వ్యామోహాన్ని, ఆర్థికపరమైన అత్యాశలను పెంచాయి. నియంతలైన పాలకులు అంతరించినా, వారి స్థానంలో కార్పొరేట్ శక్తులు పుంజుకున్నాయి. గుత్త పెట్టుబడిదారీ వర్గాలు పాలక వర్గాల్ని తమ గుప్పెట్లో పెట్టుకుని శాసించే దుర్మార్గమైన దుస్థితి ప్రపంచమంతా అలుముకుంది. నేడు పుంఖాను పుంఖాలుగా వెలువడుతున్న సాహిత్యంలో ఎంత మేరకు సమాజ గమనాగమనాల్ని, వాటి పరిణామాల్ని, ఫలితాల్ని, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దోపిడీ శక్తులైన కార్పొరేట్ వ్యవస్థల వికృత రూపాల్ని పసిగట్టి ఎత్తిచూపబడుతున్నాయో లేదో యోచించాల్సిన అవసరం సాహితీవేత్తల మీద ఉంది.

భారతదేశం వాతావరణ స్థితిగతులకు అనుకూలంగా, దేశానికి వెన్నుదన్నుగా, నిలిచి దేశ సౌభాగ్యాన్ని కాపాడే ఏకైక వృత్తి వ్యవసాయం. అందుకే అత్యధికంగా ఉండే పల్లెలు దేశానికి వెన్నెముక అంటారు. పల్లెల్లో అధిక సంఖ్యాకులు వ్యవసాయం మీద ఆధారపడి, స్వయం కృషితో వారు తిండితినటమే కాకుండా, దేశానికీ అన్నం పెడుతున్నారు. అట్టి వ్యవసాయం స్వార్థపూరిత పాలకుల అశ్రద్ధ వలన అయితేనేమి, కరువు కాటకాల వలన అయితేనేమి నానాటికి దిగబడిపోతుంది. అప్పుల ఊబిలో కూరుకుపోతుంది. అప్పులబాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడు తున్నాడు. ప్రగతికి మెట్లయిన పైరు పచ్చల వెలుగులు ఆరిపోయి, పల్లెలు బతుకు తెరువు నెతుక్కుంటూ పట్టణాలకు వలస బాట పట్టడం, మూటికి ముమ్మాటికి పాలకుల వైఫల్యమనే చెప్పొచ్చు. "కారు కారుకు పల్లె ఖతమై పోతుంటే, కొత్త కారులో పట్టణం షికారుచేస్తుంది." పల్లెల్లో లేని బతుకు తెరువు వనరులు పట్టణాల్లో సమకూరడానికి కారణం పెట్టుబడిదారీ వ్యవస్థల పనితీరనే భావించవచ్చును. భారీ పరిశ్రమల ఏర్పాటు అయితేనేమి, కార్పొరేట్

విద్యాసంస్థల్ని నెలకొల్పడమైతేనేమి, విస్తృతమైన వ్యాపార రంగం అయితేనేమి, పట్టణాలు అనూహ్యంగా పెరిగి పోతున్నాయి. వలసల కారణంగా పల్లెలు స్వరూపాన్ని కోల్పోతున్నాయి. అంటే నగరాల విస్తరణ, కేంద్రీకరణ పెరుగుతుంది. బతుకు తెరువు వనరులు అధికమయ్యాయి. పెట్టుబడిదార్లు సృష్టించే మార్కెట్టు మాయకు పట్టణాలు ఆసరాగా నిలుస్తున్నాయి. అందుకే జనాలు పల్లెల్ని విడిచి పట్టణాలకు ఎగబడుతున్నారు. కుహనా సంస్కృతికి అలవాటుపడి పట్టణాల్లో ఎదుగుబొదుగు లేని జీవితాన్ని గడుపుతున్నారు. వలసదార్లు గాని, పట్టణజనాలుగాని పట్టణాల్లో శ్రమకు తగినఫలితాన్ని పొందు తున్నారా? ప్రశాంతంగా జీవిస్తున్నారా? సౌకర్యవంతమైన మార్పులు శాంతి సుఖాల్ని ఇస్తున్నాయా! లోటుపాట్లుగా, మొనదేలిన అంశాల్ని సాహిత్యం ఎత్తిచూపగలుగుతుందా?

తాహతుకు మించి మన కొంపల్లోకి జొరబడుతున్న ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫర్నీచర్, బట్టలు, చక్రవడ్డీ అప్పులు నవ నాగరికతా చిహ్నాలందామా! ఈ సోకాల్డ్ నవ నాగరికతా పరిభాషకు భాష్యం చెప్పాల్సింది సాహిత్యమేకదా! కానీ చెబుతుందా? ఆ దిశలో సాహితీ వేత్తలు ఆలోచిస్తున్నారా? మానవ మనుగడకు సుఖ జీవనానికి పరిశ్రమలు అవసరమే! కానీ కొన్ని పరిశ్రమలు పర్యావరణం, జీవావరణం, జీవభద్రతకు జీవవైవిధ్యం దెబ్బతినడానికి కారణ మౌతున్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన కారణాలు తెలియజెప్పాల్సిన బాధ్యత సాహితీవేత్తల మీద కూడ ఉంది. ఆ పని సాహితీవేత్తలు ఎంతవరకు చేస్తున్నారు? అట్టి పరిశ్రమలను అడ్డుకోవడంలో ప్రగతిశీల సాహిత్యవాదులు నోరు మెదపాల్సిన, కలం కదిలించాల్సిన అవసరం ఉంది కదా?

సాహితీవేత్తగా ముద్రపడ్డాక, సమాజపు బరువు బాధ్యతను మోయ గలిగే నిజాయితీ, నియమనిష్ఠలు ఉండాలి అనే విషయం సాహితీ వేత్తలయిన మన వారికి ఎంతమంది తెలుసు? సామాజిక వ్యవస్థలో దూరుతున్న కుళ్లును, కుచ్ఛితాలను, దోపిడీ విధానాలను, కుల, మత, వర్ణ వివక్షను, దౌర్జన్యాలను ప్రతిఘటించే ఆలోచనలకు ఊపిరి పోయాల్సింది మొదట సాహితీవేత్తలే! ఆధునిక యుగం నవ నాగరికతకు ప్రగతిశీల దృక్పథానికి, మానవీయతకు, మకుటాయమానంగా నిలుస్తుంది అనుకోవడం భ్రమగా మారిపోతున్న విషయాన్ని పసిగట్టి దాని లోతుల్ని క్షుణ్ణంగా తడిమి చెప్పాల్సింది సాహిత్యమే! అంటే ఎప్పటికప్పుడు మారుతున్న సామాజిక స్వరూపాన్ని ఎక్స్‌రే కళ్లతో విప్పి చెప్పాల్సిన బాధ్యత సాహిత్యానికి ఉంది. నేడు మన సాహిత్యం గతం ఘనకీర్తిని నెమరేస్తూపోతుందా? వర్తమాన విధ్వంసకర ఆవృత్తాలను విప్పుకుంటూ, విశదపరచుకుంటూ పోతుందా? ఆలోచించాల్సినధర్మం నేటి సాహితీవేత్తల మీద ఉంది.

నేటి సాహితీవేత్తలు ప్రపంచ సాహిత్యాన్ని అధ్యయనం చేయకుండా, ప్రపంచీకరణ విధానాల్ని , నేటి ఆధునిక పెట్టుబడిదారీ పోకడలను, పాలకవర్గాల స్వార్థాన్ని, అగ్రరాజ్యాల ఆంతర్యాన్ని, బడుగు దేశాలా క్రందనలను, అరిగి అరిగి అమలుకు సాధ్యంకాని సైద్ధాంతిక దృక్పథాల్ని ఏవిధంగా అవగాహనించుకోగలరు? వాటి వికృత విధ్వంసక చర్యలు ప్రతిబింబించే సాహిత్యాన్ని ఏవిధంగా ఆవిష్కరించగలరు? సహేతుకుమైన శాస్త్రీయ దృక్పథంతో, ప్రగతిశీల భావాలతో జీవన సారాన్ని మథించి కాలమార్పును జీర్ణించుకున్న సైద్ధాంతిక మూలాలకు పురుడు పోస్తూ, ముందుకు సాగాల్సింది నిజమైన సాహితీవేత్తలే! ఉబుసుపోని, కాలక్షేపా నికి రాసేసాహిత్యం "సీరియస్‌నెస్" కోల్పోయి కంట్లోనలుసులా తయారవు తున్న విషయాన్ని సాహితీవేత్తలు గుర్తించాలి. సమాజ చలనాలతో సమాంతరంగా సాహిత్యం ఉరకాలి. ప్రాకృతిక అనుభూతులను వ్యక్తీకరించే కళ సాహిత్యం.

ఒక ఉద్యమ ఎత్తొంపులు, తీరుతెన్నులు అతి సూక్ష్మంగా పరిశీలించేది సాహిత్యమేననేది అక్షర సత్యం. ఉద్యమస్పర్శ ఉన్న సాహిత్యం ఉద్యమకారులకు ఆయుధంగా ఉపయోగపడుతుంది. కనుక సాహితీ వేత్తలు సామాజిక విలువల్ని కాలరాయకుండా, మానవీయతా దృష్టి దృక్పథంతో పునాదులు లేని సాహిత్యవాదాల్ని విస్మరిస్తూ, శాస్త్రీయ దృక్పథంతో, సరైన సైద్ధాంతిక భావాలతో, నిరూపణకు నిలిచే నమ్మిన విలువలకు విశ్వాసాలకి నిబద్ధులై, మేధోసంపత్తితో అచంచలమైన ఆత్మ నిగ్రహంతో, సువిశాల ప్రజాతంత్ర స్ఫూర్తితో, సాహిత్యాన్ని వెలువరిస్తే అది చరిత్రలో పదికాలాల పాటు నిలుస్తుంది. సాహితీవేత్త జీవితం ధన్యమవుతుంది. భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది అనడం సత్య దూరమైన అంశం కాదు.

సా హి తి

ఒక కప్పు చాయ్ నాలుగు మెస్సేజ్‌లు

వన్నెల వెన్నెలను చూడలేదు
ఉదర హృదయాన్ని కనలేదు
గిరి గీసుకున్న చదువు
కంచె వేసుకున్న జీవితం
వలలో చిక్కిన సాఫ్ట్వేర్ చేప
ఒంటరి మీనం కంట నించు కన్నీరు
ఉద్యోగమేందో సద్యోగమేందో
కమాయించేదెంతో ఖర్చు పెట్టేదెంతో
ప్రైస్ ఇండెక్స్‌లో అప్స్ అండ్ డౌన్స్
నిదురకు ఉపక్రమించేసరికి
పిల్లలు పడుకొని ఉంటారు
లేచేసరకే బిడ్డలు పాఠశాలకు పోతారు
నిశి నక్షత్రాలను కాంచలేదు
బంగారు సంధ్యా కాంతిని దర్శించలేదు
ఏమరుపాటుగా కుర్చీలో కూర్చొని
ఒక కప్పు చాయ్ సిప్ చేస్తూ
సెల్లో ఎంగిలి మెసేజీలు చదువుతూ
కొత్త ప్రపంచంలోకి ప్రవేశం
కాకి లగ్గం డేటింగ్ చాటింగ్ చేస్తుంటాడు
కులాస లేని విలాస విల్లాలో
కాలు మీద కాలు వేసుకున్న సౌకర్యాలు
సంబంధాలు నిలువునా
కూలిపోతుంటాయి
భూకంప కేంద్రాన్ని కనుగొనలేక
గ్రాఫిక్స్ శిథిలాల కింద
వీర రుద్ర మూలుగుల గానాలు
కాలాన్ని వృథా చేసుకుంటూ
సమయం లేదని నెపం జపం ఒకటి
సిగ్నల్ ఉంటే చార్జింగ్ ఉండదు
చార్జింగ్ ఉంటే సిగ్నల్ అందదు
మట్టి నుంచి మనసు నుంచి
డిలింక్ అవుతున్న తల్లివేరు చప్పుడు
వివాహం కుదరదు
జరిగితే పిల్లలు కలుగరు
రాయితీల ప్రోత్సాహకాలిచ్చి
ఇక ఇప్పుడు దేశమంతా
సంతాన సాఫల్య కేంద్రాలు తెరవాలి

-జూకంటి జగన్నాథం

ప్రసిద్ధ నవలల పరిచయ వేదిక

గ్రంథ సమీక్ష

అనువాదరూపంలో ఇతర దేశాల రచయితల నవలలు, కథలను చదవడం ద్వారా ఆయా రచయితల శైలి, అయా ప్రాంతాలకు సంబంధించిన విషయాలు, ముఖ్యంగా విభిన్నమైన ఆలోచనలతో సాగే రచయితల రచనలను ఆస్వాదించే అవకాశం పాఠకులకు కలుగుతుంది. అలా పాఠకులకు సరికొత్త అనుభూతిని, భిన్నమైన నవలలను అందించడంలో భాగంగా విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు ప్రముఖ రచయిత ముక్తవరం పార్థసారధిగారి అనువాదంలో అందించిన విభిన్న రచనల వేదికే 'నవలాలోకం-4' (ప్రపంచ ప్రసిద్ధ నవలల పరిచయాలు).

యుద్ధకాలంలో సాగే 'డాంగ్లింగ్ మాన్' నవల అమెరికన్ రచయిత సాల్ బెల్లో రచించాడు. ఇందలి కథానాయకుడు జోసెఫ్ రాసుకున్న డైరీ రూపంలో సాగుతుంది ఈ నవల. కథానాయకుని ఆలోచనలు, సదసత్సంశయాలు, ఆందోళనలు, అస్తిత్వ సమస్యల గురించిన మేధో మథనం ఈ కథావస్తువు. ఇందులోని మనుషుల మనస్తత్వాలను తెలుపుతూ కథానాయకుని ఆలోచనల్లో 'ఒకప్పుడు తనెంతో ఉన్నతులూ, సంస్కార వంతులూ, ఈ చీకటిలోకంలో వెలుగురేఖలు అనుకున్న మిత్రుల అసలు స్వరూపం తెలిసివచ్చింది. చాలా చవకబారుమనుషులు వాళ్ళు. మాటలకు, చేతలకూ అస్సలు పొంతన లేదు. నిబద్ధత లేదు. ఇతరులు కన్నా గొప్పవాళ్ళమనే భ్రమ కల్పించటం, తాము స్వయంగా ఆ భ్రమలో ఉండటం తప్ప నిజాయితీలేని మనుషులు' అని రాసుకుంటాడు తన డైరీలో. కథానాయకుని పాత్ర చిత్రణ అమెరికా సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన రెండో ప్రపంచయుద్ధంకాలంనాటి సమయం. వ్యక్తి స్వేచ్ఛకు పట్టంగట్టే అమెరికాలో వ్యక్తివాదాన్ని తీవ్రంగా ఖండించిన నవలగా పేర్కొనే 'డాంగ్లింగ్ మాన్' నవల రావడం అప్పట్లో ఓ సంచలనంగా పేర్కొంటారు.

'ఏ కాన్ఫెడరసీ ఆఫ్ డన్సెస్' జాన్ కెనడీ టూల్ రాసిన నవల. 'ఒక జీనియస్ భూమ్మీద అవతరించినపుడు, మూర్ఖులతనికి వ్యతిరేకంగా దుష్టకూటమిగా ఏర్పడతారు అన్న ఐరిష్ వ్యంగ్య రచయిత, విమర్శకుడు జోనాథన్ స్విఫ్ట్ ఓ వ్యాసంలో పేర్కొన వాక్యమే ఈ నవలకు ప్రేరణగా పేర్కొంటారు. 1930లలో షికాగోలోని సౌత్ సైడ్‌లో ఒక నిరుపేదల బస్తీలో నివసించిన బిగ్గర్ థామస్ అనబడే ఇరవయ్యేళ్ళ ఆఫ్రికన్-అమెరికన్ కథే రిచర్డ్ రైట్ రచించిన 'నేటివ్ సన్' నవల. అప్పట్లో అన్ని మాధ్యమాల్లోనూ తెల్లవాళ్ళు-నల్లవాళ్ళు సామరస్య ధోరణిలో బతుకుతున్నారనీ, ఇరు జాతుల మధ్యా సోదరభావం ఉందని చక్కెర గుళికల్లాంటి అబద్ధాల ప్రచారం జరిగింది. ఆ అబద్ధాల కంచుఢక్కను బద్దలు కొట్టింది నేటివ్‌సన్ నవల. వాస్తవాలను గ్రహించి, ఆలోచనా ధోరణిని మార్చుకున్నప్పుడే సమాజంలోని వివిధ జాతుల మధ్య అవగాహన పెరుగుతుంది. బిగ్గర్ థామస్ ఒక వ్యక్తి కాదు. అణచివేతకు, వివక్షకు అవమానాలకు గురైన నల్లజాతి సోదరులకు ప్రతినిధి. అమెరికన్ సమాజంలోని కఠోర వాస్తవాలను అత్యంత ప్రతిభావంతంగా చిత్రించిన నవల ఇది. నేటికీ అమెరికన్ సమాజంలో అక్కడక్కడ జాత్యహంకార ధోరణి కనిపిస్తూనే ఉంటుంది. అమెరికన్ సమాజంలోని పోకడకు అద్దం పట్టే ఈ నవల సినిమాగా కూడా రూపొందింది.



నవలాలోకం (ప్రపంచ ప్రసిద్ధ నవలల పరిచయాలు)- ముక్తవరం పార్థసారథి
పేజీలు: 202, వెల: రూ.200/-
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 33-22-2,చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520004
మరియు విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్నిబ్రాంచీలలో

బ్రిటీష్‌వారి వలసపాలనలో ఉన్న భారతదేశంలోని సోమనాథ దేవాలయంలో చంద్రుడిని అలంకరించిన మూన్‌స్టోన్ మిస్ రాచెల్ వెరిండర్ అనే ఒక ఇంగ్లీష్ యువతికి పద్దెనిమిదవ పుట్టినరోజు కానుకగా మారింది. అయితే ఆ సందర్భంగా జరిగిన సంఘటనలు, ఆపై మూన్ స్టోన్ కనిపించకుండా పోవడం... చివరకు మూన్‌స్టోన్ ఇండియాకు చేరుకుంటుంది. విల్కీ కాలిన్స్ రాసిన ఈ 'మూన్‌స్టోన్' నవలకు సంబంధించి పరిచయమే అయినా చదివే పాఠకుల్లో ఆద్యంతం అమితాసక్తిని కలిగిస్తుంది.

ఇందలి ప్రతి నవలా పరిచయం తర్వాత రచయిత గురించి వివరాలను అందించారు. ఇందులో బెస్ట్ సెల్లర్‌గా నిలిచిన నవలలతో పాటు అవార్డులను సైతం వరించిన నవలలున్నాయి. ముప్పైవరకు ఉన్న ఇందలి నవలా పరిచయాలను చదువుతుంటే ఆ నవలలను చదవాలన్న ఉత్సుకత పాఠకులకు కలిగిస్తుంది. ఈ నవలాలోకం-4 పాఠకులకు అందించిన కా॥ జి. కోటేశ్వరరావు, రచయిత ముక్తవరం పార్థసారథి, ప్రచురించిన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు అభినందనీయులు.

-జె.బి.

'డ్యూటీ' పుస్తకావిష్కరణ సభ

22 వ విశాలాంధ్ర విశాఖ పుస్తక మహోత్సవంలో టర్నల్ చౌట్రీ ఆవరణలో, విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు-13 బుధవారం సాయంత్రం ఆరుగంటలకు ఆదిరెడ్డి మావుళ్లు రచించిన "వృద్ధాప్య జీవిత యదార్థ ఘటనల దృశ్యమాలిక 'డ్యూటీ' నవల ఆవిష్కరణ సభ జరుగును. అడపా రామకృష్ణ అధ్యక్షతన జరిగే ఈ సభలో ఆర్టీసీ అధికారి ఎ.అప్పలరాజు పుస్తక ఆవిష్కరణను, ఎస్.హనుమంతరావు పుస్తక సమీక్షకులుగా వ్యవహరిస్తారు. ఆచార్య సిమ్మన్న, దామెర్ల సూర్యారావు, ఉప్పల అప్పలరాజు, సుసర్ల, మేడా మస్తాన్‌రెడ్డి, పరమేశ్వరరావు తదితరులు పాల్గొనే ఈ సభకు అందరూ ఆహ్వానితులే.

విశాఖ రచయితల సంఘం, అడపా రామకృష్ణ, కార్యదర్శి.

కోపూరి శ్రీనివాస్ స్మారక పోస్ట్ కార్డ్ కథల పోటీ ఫలితాలు

ఇటీవల రమ్యభారతి పత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన కోపూరి శ్రీనివాస్ స్మారక పోస్ట్‌కార్డ్ కథల పోటీలకు మొత్తం 165 కథలు పరిశీలనకు వచ్చాయి. వాటిలో 'సిగ్నల్స్' కథారచయిత దేశరాజుకు ప్రథమ బహుమతి, 'కార్డు కథ' రచయిత శింగరాజు శ్రీనివాసరావుకు ద్వితీయ, 'దేవుడి స్వగతం' రచయిత కొయిలాడ రామ్మోహన్‌రావుకు తృతీయ బహుమతులు లభించాయి.

కె.వి.సుమలత రచన 'మన దారిలోనే', దారం గంగాధర్ 'రూపాయి విలువ', జి.రంగబాబు 'సదస్సు', పాతూరి అన్నపూర్ణ 'ఆవేదన', నస్త త్రినాధరావు 'పోస్టర్' కథలకు ప్రోత్సాహక బహుమతులు లభించాయి. విజేతలకు జిపే ద్వారా బహుమతులు అందుతాయి.

-కోపూరి పుష్పాదేవి, అవార్డు ప్రదాత - చలపాక ప్రకాష్, సంపాదకుడు

'నెమలీకలు-నెమరువేతలు' పుస్తకావిష్కరణ ఆహ్వానం

జి.ఉమామహేశ్వర్ కథాసంపుటి "నెమలీకలు-నెమరువేతలు (శ్రీశైలం ప్రాజెక్టు హైస్కూల్ కథలు)" పుస్తక పరిచయ కార్యక్రమం ఈ నెల 17-12-2023 వ తేదీ ఉదయం 10 గంటలకు హైదరాబాద్, రవీంద్రభారతిలో జరుగుతుంది. పాలపిట్ట బుక్స్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో శ్రీయుతులు ఏనుగు నరసింహారెడ్డి, మామిడి హరికృష్ణ, పాలపిట్ట గుడిపాటి, సమ్మెట ఉమాదేవి, కోడూరి విజయకుమార్, సుధాకర్ నీల్ మొదలైన వారు పాల్గొంటారు. అందరూ ఆహ్వానితులే.

జి.ఉమామహేశ్వర్

ఎమర్జెన్సీ నుంచి 'ఎమర్జెన్సీ' దాక

మంచి పుస్తకం

ప్రబీర్ పురకాయస్థ పేరు వినగానే అక్టోబర్ 3న తెలవారగానే ఢిల్లీ పోలీసులు నిర్బంధించిన జర్నలిస్టుల్లో ఒకరేగా అని చప్పున గుర్తొస్తుంది. పైగా నిర్బంధించిన పత్రికా రచయితలనందరినీ వదిలేసి ఆయనను ఒక్కడినే ఇంకా నిర్బంధంలో ఉంచారు అని బుగ్గలు నొక్కుకుంటారు. చెవులు కొరుక్కుంటారు. దేశం అమృతోత్సవం జరుపుతున్నట్టే ప్రబీర్ పురకాయస్థ వయసుకూ 75 ఏళ్లే.

ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు ఆయన జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జె.ఎన్.యు.)లో విద్యార్థిగా ఉన్నారు. ఒకరోజు పోలీసులు వచ్చి డి.పి.త్రిపాఠీ నువ్వేనా అని అడిగారు. కాను అని పురకాయస్థ చెప్పినా వినకుండా పోలీసులు ఆయనను తీసుకెళ్లారు. దాదాపు ఏడాదిపాటు జైలులో మగ్గాల్సివచ్చింది. ఇప్పుడు మోదీ హయాంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తున్న రోజుల్లో అక్టోబరు నుంచి ఊచలు లెక్కపెడ్తూనే ఉన్నారు. ఈసారి ఆయనను అరెస్టు చేసింది ఆయన నడుపుతున్న న్యూస్‌క్లిక్ పత్రికకు చైనా నుంచి డబ్బులు అందుతున్నాయని. అవీ నేరుగా కాదు అవి ముందు ఎక్కడికోవెళ్లి ఆతరవాత అక్కడినుంచి పురకాయస్థకు అందుతున్నాయట. ఆకథ అలా ఉంచితే ఎమర్జెన్సీ సమయంలో పురకాయస్థను "మీసా" (అంతర్గత భద్రతా పరిరక్షణచట్టం) కింద అరెస్టుచేస్తే ఇప్పుడు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధకచట్టం (యు.ఎ.పి.ఎ.) కింద అభియోగాలు మోపి జైలులో పడేశారు. మీసా ఎంత భయంకరమైన చట్టమో యు.ఎ.పి.ఎ. అంతకన్నా కర్కోటకమైంది. ఎమర్జెన్సీ నుంచి అప్రకటిత ఎమర్జెన్సీ దాకా పురకాయస్థ తన జీవనయానాన్ని "కీపింగ్ అప్ ది గుడ్‌ఫైట్" అన్నపేరుతో గ్రంథస్థం చేశారు. ఈ పుస్తకంలో ఒక ఎమర్జెన్సీ నుంచి మరో ఎమర్జెన్సీ దాకా జరిగిన పరిణామాలన్నీ అక్షరబద్ధం చేశారు. మొదటిసారి ఎమర్జెన్సీలో అరెస్టయినప్పుడు ఆయన విద్యార్థి. యువకుడు. ఇప్పుడు ఆయన పరిణతి చెందిన పత్రికా రచయిత. ఆయన 75 ఏళ్ల ప్రస్థానం అక్షరబద్ధంచేసే క్రమంలో దేశపరిణామాలను కూడా రికార్డుచేశారు. పత్రికా రచయిత చేయవలసిన పని అది మరి.

ఈ 75 ఏళ్లకాలంలో ఆయనను సంపన్న, వైవిధ్యభరిత, సమానత, ఆహ్లాదకరమైన, సంక్లిష్టభరిత విశాల విశ్వం నుంచి తాను నేర్చుకున్న అనేక విషయాలను ఈ ఆత్మకథలో రాశారు. ఇక చేయవలసిందల్లా అందరికీ మరింత మెరుగైన సమాచారం అందించడం కోసం పోరాడడమే అంటారు పురకాయస్థ. తన జీవితకథ చెప్పడంలో భాగంగా దేశచరిత్ర చెప్పారు. "కీపింగ్ అప్ ది గుడ్‌ఫైట్" దేశచరిత్ర. చరిత్ర నిర్మాణంలో భాగస్వామి అయిన పోరాట యోధుడి గాథ. పురకాయస్థ తన జీవిత గమనాన్ని వివరించే క్రమంలో తనకు చేదు అనుభవాలు మిగిల్చిన వారిని కూడా దుయ్యబట్టలేదు. వారూ పరిస్థితుల ప్రభావం వల్లే అప్పుడు అలా నడుచుకున్నారు అని ఓ తత్వవేత్తలా మాట్లాడతారు. ఆ తత్వం ఆధ్యాత్మికమైందికాదు. అది భౌతికవాద పునాది మీద ఏర్పడిన బౌద్ధికవాదం.

పురకాయస్థ చదివింది ఇంజినీరింగ్. ఆయనకు సైన్స్ అంటే అమితమైన ప్రేమ. ఆయన జీవితాన్ని నడిపించింది శాస్త్రీయ స్ఫూర్తి, సాంకేతికత, రాజకీయాలే. ఆయన ఎంచుకున్న రాజకీయాలు పడకకుర్చీకి పరిమితమైనవి కావు. రాజకీయ నాయకుడిగా గుర్తింపు లేకపోయినా ఆయన జీవితం రాజకీయాలతో ముడివడిపోయింది. విస్తారమైన అనుభవం, అపారమైన సామాజిక కార్యకలాపాలు ఉన్నవారి జీవిత చరిత్రను మరెవరోరాస్తే అందులో బలమైన వ్యక్తీకరణ ఉండే అవకాశం ఉంటుంది. కాని ఆత్మకథలో రెండేమార్గాలు. ఒకటి ఆత్మస్తుతి. ఇలాంటి రచనలో ఆత్మకథ రాసుకునేవారు తమని తాము ఆకాశానికి ఎత్తుకున్నా చేయగలిగింది ఏమీలేదు. కానీ ఎవరి జీవితకథ వారేచెప్తే, ఆపని నిజాయితీగా చేస్తే ఆత్మకథ రాసుకున్న వారిజీవితం ఎంత ఉజ్జ్వలమైంది అయినప్పటికీ తమ జీవితంలో సమాజం కూడా భాగం అనుకునేవారు వినమ్రంగా రాస్తారు. ఈ అణకువ కొంత సొబగుకు కత్తెరవేయొచ్చు. నిజాయితీగా, వినమ్రంగా ఆత్మకథ రాసే వారిని ఈ రెండు సూత్రాలు వెనకనుంచి కళ్లెంపట్టుకుని లాగుతున్నట్టుగా ఉంటుంది. పురకాయస్థ ఈ దారినే ఎన్నుకున్నారు. పురకాయస్థ తన గురించి గొప్పలు చెప్పుకోలేదు. చేసినపనినీ పెద్దగా చెప్పరు. సాధించిన విజయాలను అంతగా ప్రస్తావించరు. తన ఆదర్శాలు ఏమిటో గట్టిగా వ్యక్తీకరించారు. ఈ పద్ధతిలోని ఆత్మకథల్లో ప్రజా సమస్యలు, సవాళ్లు, ఇతరులు చేసిన సేవలు ప్రముఖంగా ప్రస్తావనకు వస్తాయి. పురకాయస్థ చేసింది సరిగ్గా ఇదే.

ప్రబీర్ పురకాయస్థ జీవితకాలం జాతీయవాదానికి, శాస్త్రీయస్ఫూర్తికి, అణగారిన వర్గాలకు న్యాయం చేయడానికి అంకితం అయింది. చిన్నప్పుడు సాహసగాథలు, అపరాధ పరిశోధక (డిటెక్టివ్) నవలలు, చారిత్రక-కాల్పనిక సరంజామా చదువుతూ గడిపారు పురకాయస్థ. క్రమంగా సైన్సు, గణితంమీద అభిరుచి పెరిగింది. దేవుడు, మతం మీద విశ్వాసం సడలింది. చివరకు నిరీశ్వరవాదిగా మారారు.

సైన్సు, సాంకేతికత మీద ఆయనకు ఉన్న ఆసక్తి వాటి లోతుపాతులను తెలుసుకోవడానికే పరిమితం కాలేదు. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు సమాజానికి జవాబుదార్లుగా ఉండాలంటారు. అంటే ఆ పరిశోధనలు మానవ జీవితాన్ని మరింత సరళం, సురక్షితం, సుఖమయం చేయడానికి ఉపకరించాలంటారు ఆయన. సైన్సు అంటే పురకాయస్థ ఉద్దేశంలో అదేదో మార్మికమైందో, అభేద్యమైందో కాదు. సైన్సుకు సామాజిక కోణం ఉంటుంది. అదేలేకపోతే ఎంతమహత్తరమైన విజ్ఞానం అయినా, సాంకేతికత అయినా ఎందుకూ కొరగాకుండా పోతుంది. విజ్ఞానశాస్త్రం ఏ ఒక్కరి సొత్తూ కాదు. అది పారిశ్రామిక దేశాల గుప్పెట్లో బందీఅయి పోకూడదు. శాస్త్రీయ స్ఫూర్తి పెంపొందించడానికి తోడ్పడాలి. ఈ అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే వారికి ప్రబీర్ పురకాయస్థ "కీపింగ్ అప్ ది గుడ్‌ఫైట్" చదవదగింది. పాలకుల దుశ్చర్యల వల్ల నిరంతరం కుంగిపోతూ ఉంటే మనం చరిత్ర నిర్మాతలం కాలేం. పాలకులకు అమితమైన శక్తి సామర్థ్యాలు ఉండవచ్చు. వ్యక్తులు, సంస్థల మీద పెత్తనంచేస్తూ ఉండొచ్చు. కానీ చరిత్ర రూపకర్తలు ప్రజలే అని ప్రబీర్ అంటారు. నియంతల దాష్టీకాన్ని ప్రజలు మౌనంగా భరిస్తున్నారంటే అది ఆ క్రౌర్యాన్ని ఆమోదించడం కాదు. ఎమర్జెన్సీ తరవాత ఇందిరాగాంధీ స్వేచ్ఛగా జరిగే ఎన్నికల ద్వారా ప్రజల ఆమోదముద్ర కావాలనుకున్నారు. ప్రస్తుత పాలకులు స్వేచ్ఛ ఉందనే ముసుగులో, సామాజిక మాధ్యమాల ద్వారా మీడియాను గుప్పెట్లో పెట్టుకుంటే అంతా తమకు అనుకూలంగా ఉందనుకుంటారు అంటారు ప్రబీర్. ఇది కొద్దికాలం సాగొచ్చు. కొన్ని రాష్ట్రాల్లో సాధ్యం కావొచ్చు. పొరుగుదేశంతో ఎప్పుడూ యుద్ధ భయం ఉన్నట్టు చిత్రించవచ్చు. జనంగొప్ప నాయకుడికి అండగా నిలబడాలని ప్రచారం చేయొచ్చు. కానీ ఇవేవీ దీర్ఘకాలం నిలబడవని రెండు ఎమర్జెన్సీల అనుభవంతో పురకాయస్థ చెప్తారు.

కమ్యూనిస్టు మానిఫెస్టో మొదటిసారి చదివిన తరవాత రోమాలు నిక్కబొడుచుకున్నాయంటారు పురకాయస్థ. సాధారణంగా ఎవరి అనుభవమైనా ఇదే. వియత్నాం ప్రతిఘటనకు చిహ్నాం అన్న ఆయన మాటలు ప్రస్తుత తరం పలస్తీనాతో అన్వయించుకోవాలేమో. జె.ఎన్.యు.లో జ్ఞానతృష్ణ, సమానత్వకాంక్ష, మేధో వికాసావకాశం, భిన్నాభిప్రాయాలనూ, తాత్వికతలను ప్రోత్సహించే రాజకీయ వాతావరణం ఒకప్పుడు ఎలా ఉండేదో ప్రబీర్ ప్రవర్తించిన తీరుచూస్తే ప్రస్తుత పాలకవర్గం దాన్నంతటినీ ధ్వంసం చేయడానికి ఎందుకు ప్రయత్నిస్తోందో అర్థం అవుతుంది. ప్రబీర్ మీద మోదీ ప్రభుత్వం దాడి 2021 ఆరంభంలోనే మొదలైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 113 గంటలపాటు సోదాచేసింది. ప్రశ్నల ద్వారా వేధింపు ప్రబీర్‌కు అలవాటైన వ్యవహారంగా మారింది. రెండు ఎమర్జెన్సీల మధ్య తేడాను ప్రబీర్ నిర్వచించిన తీరుకు ఒక్క ఉదాహరణ చాలు. "కాంగ్రెస్ సైద్ధాంతికత కొన్ని వర్గాల వారిని పరాయి వారిగా చూడలేదు. రెండవ శ్రేణి పౌరులుగా భావించలేదు. వారి హక్కులు కాజేయలేదు" అన్న ప్రబీర్ వ్యాఖ్య ఈ పుస్తకం ఎందుకు చదవాలో చెప్పడానికి ఉదాహరణ.

ఆర్వీ రామారావ్

దేశంలో మళ్లీ పెరిగిన కొత్త కరోనా కేసులు



న్యూఢిల్లీ: దేశంలో చాలా రోజుల తర్వాత మళ్లీ కరోనా కొత్త కేసులు పెద్ద సంఖ్యలో నమోదయ్యాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 24 గంటల 166 మంది కొత్తగా కొవిడ్ మహమ్మారి బారినపడ్డారు. ఈ 166 కొత్త కేసులలో అత్యధికంగా కేరళ రాష్ట్రంలోనే రికార్డయ్యాయి. తాజా కేసులతో కలిపి దేశంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 895కు చేరింది. ఇటీవలి వరకు రోజువారీ కరోనా కేసుల సగటు 100 గా ఉంది. ఇప్పుడు శీతాకాలం కావడంతో ఇన్‌ఫ్లూయెంజా లాంటి వైరస్‌ల కారణంగా కేసుల సంఖ్యలో పెంపు కనిపిస్తోందని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. కరోనా తీవ్రత తగ్గినప్పటి నుంచి దేశంలో అతి తక్కువ కరోనా కేసుల జులైలో నమోదయ్యాయని అధికారులు చెప్పారు. 2023 జులై 24న కొత్త కరోనా కేసులు కేవలం 24 మాత్రమే నమోదయ్యాయని తెలిపారు.

ట్రక్కుల్లో ఏసీ క్యాబిన్ తప్పనిసరి

గెజిట్ నోటిఫికేషన్ జారీ

న్యూఢిల్లీ: ట్రక్కుల్లో ఏసీ క్యాబిన్‌ను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. 2025 అక్టోబర్ 1 తర్వాత తయారు చేయబోయే ట్రక్కుల్లో ఏసీ క్యాబిన్ ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. ఎన్2, ఎన్3 కేటగిరీ పరిధిలోకి వచ్చే ట్రక్కులకు దీన్ని తప్పనిసరి చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఆదివారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సరకుల రవాణాకు ఉపయోగించే ట్రక్కుల స్థూల బరువు 3.5 టన్నుల నుంచి 12 టన్నుల వరకు ఉంటే అవి ఎన్2 కేటగిరీ కిందకు వస్తాయి. 12 టన్నులు దాటితే ఆ ట్రక్కును ఎన్3గా వర్గీకరిస్తారు. దీనికి సంబంధించిన ముసాయిదా నోటిఫికేషన్‌కు ఆమోదం లభించినట్లు రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ జులైలోనే వెల్లడించారు. ట్రక్కు డ్రైవర్లకు మెరుగైన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతోనే ఈ కొత్త నిబంధన తీసుకొస్తున్నామని తెలిపారు. తద్వారా వారి పని సామర్థ్యం పెరుగుతుందన్నారు. వేడి వాతావరణంలో పనిచేసే వారికి ఇకపై అలసట నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. దేశాభివృద్ధికి అత్యంత కీలకమైన రవాణా రంగంలో ట్రక్కు డ్రైవర్లది చాలా కీలక పాత్ర అని కొనియాడారు. వారి సమస్యల్ని పరిష్కరించడం చాలా ముఖ్యమైన అంశమన్నారు. పని వాతావరణాన్ని మెరుగుపర్చడం వల్ల వారి మానసిక స్థితి కూడా బాగుంటుందన్నారు.

తమిళనాడుకు మళ్లీ వర్ష సూచన

చెన్నై: తమిళనాడు రాష్ట్రం వర్షాలతో అతలాకుతలం అవుతోంది. ఇప్పటికే మిచౌంగ్ తుపాను ధాటికి చెన్నై సముద్రాన్ని తలపిస్తోంది. ఎక్కడా చూసినా వరద నీరు, బురదమయైంది. భారీ వర్షాల కారణంగా చెన్నైలో ప్రజల జీవితం దెబ్బతింది. డిసెంబర్ 4న కురిసిన భారీ వర్షాల కారణంగా ఇప్పటికే అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. నగర వ్యాప్తంగా విద్యాసంస్థలు మూతపడిన సంగతి తెలిసిందే. కాగా తమిళనాడుకు వర్షం ముప్పు తప్పడం లేదు. వచ్చే 2-3 రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడుతాయిన ఐఎండీ హెచ్చరించింది. తమిళనాడుతో పాటు కేరళ, పుదుచ్చేరి, కారైకల్‌లో కూడా వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. శనివారం తమిళనాడు, కేరళలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. తమిళనాడులోని తిరునల్వేలి, కూనూర్‌లో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, కేరళలోని వడవత్తూరులో 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరదల్లో చిక్కుకున్న చెన్నైలోని బాధిత కుటుంబాలకు తక్షణ సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.6000 ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే ఈ రిలీఫ్ ఫండ్‌ని పెంచాలని డిమాండ్లు వస్తున్నాయి. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై.. ఈ సాయాన్ని రూ.10,000కి పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రప్రభుత్వం ఒక్క పైసా కూడా సహాయ నిధికి అందించలేదన్నారు.

రూ.350 కోట్ల అక్రమ నగదు

ఒడిశాలో కొనసాగుతున్న ఐటీ దాడులు

భువనేశ్వర్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఒడిశా ఆదాయపన్ను (ఐటీ) శాఖ దాడులు ఐదో రోజు ఆదివారం కూడా కొనసాగుతున్నాయి. జార్ఖండ్ నుంచి రాజ్యసభ ఎంపీగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నేత ధీరజ్‌సాహుకు చెందిన లిక్కర్ కంపెనీ కార్యాలయాల్లో జరుగుతున్న ఈ సోదాల్లో ఇప్పటివరకు రూ.300 కోట్ల లెక్కల్లోకి రాని నగదును ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ధీరజ్‌సాహుకు చెందిన బౌధ్ డిస్టిలరీతో పార్టనర్‌షిప్‌లో ఉన్న బల్దేవ్ సాహు గ్రూపు కంపెనీల్లో ఉన్న ఐటీ అధికారులు ఆదివారం ఉదయం సోదాలు నిర్వహించారు.ఐటీ అధికారులు ఈ కంపెనీల కార్యాలయాల నుంచి మరింత నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మరోపక్క సాహు, ఆయన బంధువుల కంపెనీల కార్యాలయాలు, ఇళ్ల నుంచి బయటపడుతున్న గుట్టలు గుట్టల సొమ్మును లెక్కించడానికి ఐటీ అధికారులు చెమటోడ్చాల్సి వస్తోంది. ఇప్పటికే ఈ డబ్బు లెక్కించేందుకు 40 కౌంటింగ్ మెషీన్లు వినియోగిస్తుండగా తాజాగా మరిన్ని మెషీన్లను, సిబ్బందిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) నుంచి రప్పించారు. సోదాల్లో దొరికిన మొత్తం అక్రమ నగదు రూ.350 కోట్ల వరకు చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఐదో రోజు సాహు కంపెనీలపై జరుగుతున్న ఐటీ సోదాల్లో సంచలన విషయం బయటపడింది. నగదులోఉన్న రూ.5 లక్షల పాలిథిన్ బ్యాగుపై ఇన్‌స్పెక్టర్ తివారీ అని పేరు రాసి ఉండడం విశేషం. కాగా, ఇదే విషయమై బీజేపీ నేషనల్ చీఫ్ జగత్ ప్రకాష్ నడ్డా ఎక్స్(ట్విటర్)లో ఒక పోస్టు చేశారు. 'మీరు పరుగెత్తి పరుగెత్తి అలసిపోవాల్సిందే..మిమ్మల్ని విడిచిపెట్టం' అని పోస్టులో నడ్డా పేర్కొన్నారు.

సుఖ్‌దేవ్ సింగ్ హత్యకేసులో ముగ్గురి అరెస్టు

న్యూఢిల్లీ: రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణిసేన చీఫ్ సుఖ్‌దేవ్ సింగ్ హత్య కేసులో ఢిల్లీ పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో ఇద్దరు ప్రధాన నిందితులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్, రాజస్థాన్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నిందితులను చండీగఢ్‌లో అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం (డిసెంబర్ 10) మీడియకు తెలిపారు. స్పెషల్ పోలీస్ కమిషనర్ రవీంద్ర యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... కేసు నమోదైనప్పటి నుంచి నిందితులను ట్రాక్ చేశామని, తాజాగా చండీగఢ్‌లో వాళ్లు పట్టుబడ్డారని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఆదివారం అరెస్టైన వారిలో ప్రధాన నిందితులు రోహిత్ రాథోడ్, నితిన్ ఫౌజీ ఉన్నారు. ఈ హత్యోదంతంలో మరో వ్యక్తి కూడా వీరికి సహకరించాడు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన అనంతరం వారిని ఢిల్లీలోని క్రైం బ్రాంచ్ కార్యాలయానికి తరలించారు. సుఖ్‌దేవ్ సింగ్ హత్యకు సంబంధించి హర్యానాలోని మహేంద్రగఢ్‌కు చెందిన రామ్‌వీర్ సింగ్‌ను డిసెంబర్ 9 (శనివారం)న జైపూర్ పోలీసులు అరెస్టు చేశారు. కాగా డిసెంబర్ 5వ తేదీన ఇద్దరు షూటర్లు నితిన్ ఫౌజీ, రోహిత్ రాథోడ్, నవీన్ షెకావత్ అనే ముగ్గురు దుండగులు బైక్ మీద వచ్చి.. శ్యామ్ నగర్‌లోని సుఖ్‌దేవ్ సింగ్ గోగమేడిని అతని నివాసంలో విచక్షణారహితంగా కాల్పులు జరిపి హత్య చేసిన సంగతి తెలిసిందే. నిందితులు సుఖ్‌దేవ్ సింగ్‌తో మాట్లాడుతున్నట్లు నటించి ఒక్కసారిగా తుపాకులతో కాల్పులు జరిపారు. సుఖ్‌దేవ్ సింగ్ హత్య అనంతరం పోలీసులపై నితిన్ ఫౌజీ, అతని సహచరులు కాల్పులు జరిపి పరార్ అయ్యారు. పోలీసులు జరిగిన ఎదురు కాల్పుల్లో మూడో దుండగుడు నవీన్ షెకావత్.. సుఖ్‌దేవ్ నివాసంలోనే ప్రాణాలు కోల్పోయాడు. ఎదురు కాల్పుల్లో సుఖ్‌దేవ్ సెక్యూరిటీ గార్డు ఒకరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. సుఖ్‌దేవ్ సింగ్‌ను కుటుంబ సభ్యులు హుటాహుటీన ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు.

దేశంలో భారీగా విద్యుత్ డిమాండ్

న్యూఢిల్లీ: దేశంలో విద్యుత్‌కు భారీగా డిమాండ్ పెరిగింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 9 శాతం పెరుగుదల నమోదైంది. ఏప్రిల్-నవంబర్ మధ్య దేశంలో మొత్త విద్యుత్ వినియోగం 1099.90 బిలియన్ యూనిట్లుగా రికార్డు కాగా... గత ఏడాది ఇదే సమయంలో విద్యుత్ వినియోగం 1010.20 బిలియన్ యూనిట్లుగా ఉంది. 2021-22 సంవత్సరంలో ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో మొత్తం వినియోగం 916 బిలియన్ యూనిట్లుగా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వినియోగం 1504.26 బిలియన్ యూనిట్లు. ఇది 2021-22 ఆర్థిక సంవత్సరంలో 1374 బిలియన్ యూనిట్ల కంటే ఎక్కువ. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో విద్యుత్ వినియోగం 9శాతం పెరగడం దేశ ఆర్థిక వ్యవస్థలో వృద్ధి కారణమని ఇంధనరంగ నిపుణులు పేర్కొటున్నారు. 2013-14 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2022-23లో దేశంలో విద్యుత్ వినియోగం 50.8 శాతం పెరిగిందని కేంద్ర ఇంధనశాఖ మంత్రి

ఆర్‌కే సింగ్ ఇటీవల లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. 2013-14లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 136 గిగావాట్లు కాగా.. 2023లో ఈ డిమాండ్ 243 గిగావాట్లకు పెరిగింది. మంత్రి మాట్లాడుతూ.. సామర్థ్యాన్ని 194 గిగావాట్లకు పెంచాం... దీంతో పెరుఉతున్న విద్యుత్ డిమాండ్‌తో మాకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఈ వేసవిలో విద్యుత్ డిమాండ్ 229 గిగావాట్లకు చేరుకుంటుందని ఇంధన మంత్రిత్వ శాఖ పేర్కొంది. అయితే, ఏప్రిల్-జూలైలో కురిసిన అకాల వర్షాల కారణంగా విద్యుత్ డిమాండ్ కాస్త తక్కువగా ఉండడంతో ఇప్పటికీ ఆశించిన స్థాయి కంటే తక్కువగానే ఉంది. గత జూన్‌లో దేశంలో విద్యుత్ డిమాండ్ 224 గిగావాట్లకు చేరినప్పటికీ, జులైలో అది క్షీణించి 209 గిగావాట్లకు చేరుకుంది. ఆ తర్వాత ఆగస్టులో 238.82 గిగావాట్లు, సెప్టెంబర్‌లో 243.27 గిగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉన్నది. అక్టోబర్‌లో దేశంలో విద్యుత్ డిమాండ్ 222.16 గిగావాట్లు కాగా, నవంబర్‌లో 204.86 గిగావాట్లు రికార్డయ్యింది. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే, జున్ నెలల్లో కురిసిన వర్షాల కారణంగా విద్యుత్ డిమాండ్ తగ్గినా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో విద్యుత్‌కు డిమాండ్ పెరిగింది. దీంతో పాటు పండుగల సీజన్‌కావడంతో పారిశ్రామిక కార్యకలాపాలు పెరగడంతో విద్యుత్‌కు డిమాండ్ పెరిగింది.

ఉచితాలు కాదు...

ప్రజల్ని శక్తిమంతుల్ని చేయాలి

ఉపరాష్ట్రపతి ధన్కర్

న్యూఢిల్లీ: ప్రస్తుత సమాజంలో 'ఉచిత' పథకాల పేరుతో జరుగుతున్న పోటాపోటీ రాజకీయాలపై ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అలా చేయడం వ్యయ ప్రాధాన్యతలను మార్చుకోవడమే అవుతుందని పేర్కొన్నారు. జేబులకు భరోసా ఇవ్వడం కాదని.. ప్రజలను శక్తిమంతం చేయాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా 'భారత మండపం'లో ఎన్‌హెచ్ఆర్‌సీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దీర్ఘకాలంలో దీని ఫలితాలపై దేశవ్యాప్తంగా ఆరోగ్యకరమైన చర్చ జరగాల్సి ఉందన్నారు. భారత్ మాదిరిగా ప్రపంచంలో ఏ ప్రదేశమూ మానవ హక్కులతో విరాజిల్లడం లేదని స్పష్టం చేశారు. 'మానవ హక్కుల్లో ప్రపంచంలో ఏ భాగం కూడా భారత్ మాదిరిగా విరాజిల్లడం లేదు. మన నాగరికత, రాజ్యాంగ రూపకల్పన అనేవి మానవ హక్కులను గౌరవించడం, పరిరక్షించడం, పెంపొందించడంలో మన నిబద్ధతను చాటిచెబుతున్నాయి. ఇది మన డీఎన్ఏలోనే ఉంది' అని భారత ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్ పేర్కొన్నారు. ఇక రాజకీయాల్లో పోటాపోటీగా చూస్తున్న ఉచితాలపై ఉపరాష్ట్రపతి స్పందించారు. 'జేబులకు భరోసా ఇవ్వడం అనేది ఆర్థికంగా ఆధారపడటాన్ని పెంచుతుంది. మనం ప్రస్తుతం చూస్తున్న ఉచిత రాజకీయాలు కేవలం వ్యయ ప్రాధాన్యతలను వక్రీకరించడమే. దిగ్గజ ఆర్థిక నిపుణుల ప్రకారం, ఉచితాలు అనేవి స్థూల ఆర్థిక స్థిరత్వం ప్రాథమిక సూత్రాన్ని బలహీనపరుస్తాయి' అని ధన్‌ఖర్ తెలిపారు. దీర్ఘకాలంలో జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ఆర్థిక వ్యవస్థపై ఈ ప్రోత్సాహం ఎంత భారం అనే విషయాలపై జాతీయ స్థాయిలో ఆరోగ్యకరమైన చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. 'అమృత్ కాల్' సమయంలోనే యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) కూడా 75వ వార్షికోత్సవాన్ని చేసుకోవడం యాదృచ్ఛికమని జగ్‌దీప్ ధన్కర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత్‌లోని ఐరాస రెసిడెంట్ కోఆర్డినేటర్ శోంబి షార్ప్ పాల్గొన్నారు. ఐక్యరాజ్య సమితి జనరల్ సెక్రటరీ పంపిన సందేశాన్ని ఆయన చదివి వినిపించారు.

'మేము మౌనంగా ఉన్నాం కాబట్టే సీఎం అయ్యాడు'

పంజాబ్ సీఎంపై సంచలన ఆరోపణలు



చండీగఢ్: పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌పై ఆయన మొదటి భార్య కుమార్తె సీరత్ మాన్ చేసిన విమర్శలు, ఆరోపణలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తాను సీఎం భగవంత్ మాన్ కుమార్తెనని, అయితే ఆయనను నాన్న అని పిలిచే హక్కుని చాలా కాలంగా కోల్పోయాడని అన్నారు. 'నేను ఈ వీడియో చేయడం వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదు. నా కథ బయటకు రావాలని కోరుకుంటున్నాను. ప్రజలు మా గురించి ఏది విన్నారో, అది సీఎం మాన్ స్వయంగా చెప్పినవే' అని ఆమె అన్నారు.

ఇప్పటి వరకు తాను మౌనంగా ఉన్నానని, తన తల్లి కూడా మౌనంగా ఉందని, మా మౌనమే తమ బలహీనగా భావిస్తున్నట్లు చెప్పింది. మా మౌనం కారణంగానే అతను ప్రస్తుతం సీఎం కుర్చున్నాడనే విషయం అతనికి తెలియదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎం మాన్ రెండో భార్య గురుకీరత్ గర్భవతి అని, సీఎం మూడోసారి తండ్రి కాబోతున్నాడని సీరత్ వీడియోలో చెప్పింది. ఈ విషయం కూడా తమకు ఇతరుల ద్వారా తెలిసిందని సీరత్ చెప్పారు. నీకు ఇప్పటికే ఇద్దరు పిల్లలు ఉన్నారు, వారిని నిర్లక్ష్యం చేసి ఇప్పుడు మూడో వాడికి జన్మనివ్వాలని అనుకుంటున్నావని సీఎంని ప్రశ్నించింది. గతంలో సీఎం మాన్‌ని కలిసేందుకు తన సోదరుడు దోషన్ రెండుసార్లు పంజాబ్ వెళ్లారని, దోషన్ సీఎం ఇంటికి రానివ్వలేదని, ఆ తర్వాత అతను చండీగఢ్‌లో స్నేహితులతో కలిసి ఉన్నాడని సీరత్ చెప్పింది. అతడిని ఇంటి నుంచి వెళ్లగొట్టారని, సొంత పిల్లల బాధ్యత తీసుకోలేని వ్యక్తి ప్రజల బాధ్యత ఎలా తీసుకుంటారని ఆమె ప్రశ్నించారు. మేము చూసిన బాధలు పంజాబ్ ప్రజలకు కూడా పడుతున్నారని... తన తల్లి రాజకీయాల్లోకి రాకూడదని సీఎం మాన్ విడాకులకు కారణాలు చెబుతున్నాడని, కానీ విడాకులకు చాలా కారణాలు ఉన్నాయన్నారు. తన తల్లి ఆమె కథను చెప్పేందుకు సిద్ధంగా ఉందని సీరత్ చెప్పారు. భగవంత్ మాన్ మద్యం సేవించడం, మానసిక, శారీరక వేధింపులకు గురిచేశాడని, అతను అసెంబ్లీకి, గురుద్వారాలకు కూడా మత్తులోనే వెళతాడని సంచలన ఆరోపణలు చేశారు.

ఏడేళ్ల క్రితమే మొదటి భార్యకు విడాకులు

భగవంత్ మాన్‌కు మొదట ఇంద్రపీర్ కౌర్‌తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం సీరత్ కౌర్, దిల్షాన్ ఉన్నారు. 2015లో ఆయన తన భార్యకు విడాకులు ఇచ్చారు. ఆ తర్వాత ఇంద్రప్రీత్ తన సంతానంతో కలిసి అమెరికాలో ఉంటున్నారు. గతేడాది మార్చి 16న పంజాబ్ ముఖ్యమంత్రిగా భగవంత్ మాన్ ప్రమాణస్వీకారం చేసినపుడు ఆ వేడుకకు సీరత్, దిల్షాన్ సైతం వచ్చారు. ఆ తర్వాత హరియాణాకు చెందిన డాక్టర్ గురుప్రీత్ కౌర్ (32)ను భగవంత్ మాన్ రెండో వివాహం చేసుకున్నారు.

మోదీ సర్కార్ వార్షిక వృద్ధి 5.4 శాతమే

- కానీ త్రైమాసిక వృద్ధిని ప్రత్యేకంగా చూపుతోంది
- కాంగ్రెస్ పార్టీ ధ్వజం

న్యూఢిల్లీ: ఇటీవలి త్రైమాసిక వృద్ధి సంఖ్యల ఆధారంగా 'భారతదేశంలో పరివర్తనాత్మక జీడీపీ వృద్ధి' గురించి మాట్లాడుతున్నామని, నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిగా ఇప్పటివరకు వార్షిక సగటు జీడీపీ వృద్ధి రేటు 5.4 శాతం మాత్రమేనని కాంగ్రెస్ పార్టీ ఆదివారం కేంద్రంపై దుమ్మెత్తిపోసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో, 'జులై-సెప్టెంబరు 2023కి సంబంధించిన ఇటీవలి సంఖ్యల ఆధారంగా 'భారతదేశంలో పరివర్తనాత్మక జీడీపీ వృద్ధి' గురించి ప్రధాని, ఆర్థిక మంత్రి పదేపదే మాట్లాడుతున్నారు. అయితే మీరు త్రైమాసిక వృద్ధి సంఖ్యలను పక్కన పెడితే ఇది అనేక కారణాల వల్ల ఎక్కువ లేదా తక్కువగా ఉండవచ్చు. చాలా ముఖ్యమైనది ఏమిటంటే, ఆర్థిక వ్యవస్థ ఎంత బాగా పని చేస్తుందో అర్థం చేసుకోవడానికి ఎక్కువ కాలం పాటు వార్షిక వృద్ధి రేట్లు' అని స్పష్టం చేశారు. మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు, వార్షిక సగటు జీడీపీ వృద్ధి రేటు 8.1 శాతంగా ఉందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలో ఇప్పటి వరకు వార్షిక సగటు జీడీపీ వృద్ధి రేటు కేవలం 5.4 శాతమేనని తెలిపారు. ఏది నిజంగా పరివర్తన చెందుతుంది?' అని ప్రశ్నించారు. భారతదేశం రెండవ త్రైమాసిక వృద్ధి ప్రపంచంలోనే అత్యధికంగా ఉందని, దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పేర్కొన్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ఆర్థిక స్థితిగతులపై రాజ్యసభలో భారీ సంఖ్యలో సభ్యులతో మూడు రోజుల పాటు జరిగిన చర్చకు సమాధానమిస్తూ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

వారణాసిలో ర్యాలీతో నితీశ్ ప్రచారం ఆరంభం

పాట్నా: వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ డిసెంబరు 24న ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటరీ నియోజకవర్గం వారణాసిలో భాగమైన రోహనియా అసెంబ్లీ సెగ్మెంట్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. బీహార్ మంత్రి, జనతాదళ్ (యునైటెడ్) సంస్థాగత కార్యదర్శి శ్రవణ్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ధ్రువీకరించారు. నితీశ్ కుమార్ ర్యాలీకి వేదికను ఖరారు చేసేందుకు శ్రవణ్ కుమార్, కొందరు స్థానిక నాయకులతో కలిసి శనివారం రోహనియాను సందర్శించారు. లోక్‌సభ ఎన్నికల కోసం నితీశ్ కుమార్ తొలిసారిగా నిర్వహించనున్న రోహనియా బహిరంగ సభకు పూర్వాంచల్ ప్రాంతానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కానున్నారు. వారణాసితో పాటు అజంగఢ్, ప్రతాప్‌గఢ్, ప్రయాగ్‌రాజ్, ఫుల్‌పూర్, అంబేద్కర్ నగర్, మీర్జాపూర్‌పై దృష్టి సారించనున్నట్లు ఆయన వివరించారు. అధికారంలో ఉన్న బీజేపీపై ధ్వజమెత్తిన బీహార్ ముఖ్యమంత్రి... కులం, మతం వారి అజెండాలో ఉన్నాయని, 'మా అజెండా సోదరభావం, ప్రేమ' అని అన్నారు. కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని (ఇండియా కూటమి) కొందరు నేతలు పొరపాట్లు చేశారని, దీంతో లోక్‌సభ ఎన్నికల వ్యూహం రూపొందించడం కాస్త ఆలస్యమైందని అన్నారు. 'ఇప్పుడు మేము ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాము. లోక్‌సభ ఎన్నికలకు పక్కా వ్యూహాన్ని సిద్ధం చేయబోతున్నాము' అని చెప్పారు. రోహనియా వారణాసిలో పటేల్ మెజారిటీ అసెంబ్లీ నియోజకవర్గం. 2012 నుంచి జరిగిన ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో రోహనియాలో సంఘం నిర్ణయాత్మక పాత్ర పోషిస్తోంది. వారణాసి, ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ నియోజకవర్గం. గోరఖ్‌పూర్, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కంచుకోట, అజంగఢ్, ప్రయాగ్‌రాజ్, తూర్పు, మధ్య యూపీలోని అనేక ఇతర ప్రాంతాలలో చాలా వెనుకబడినవారు ఎక్కువగా ఉన్నారు.

దేశాభివృద్ధికి యువత అభిప్రాయాల సేకరణ

నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం

న్యూఢిల్లీ: 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం యువత అభిప్రాయాలను తీసుకుంటుందని నీతి ఆయోగ్ సీఈఓ బి.వి.ఆర్.సుబ్రహ్మణ్యం చెప్పారు. విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యా సంస్థల ద్వారా ఈ కసరత్తును ఉత్తమంగా నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు యువకుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు డిసెంబరు 11న దేశవ్యాప్తంగా రాజ్ భవన్‌లలో 700కు పైగా విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల వర్క్ షాప్‌లలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తారని సుబ్రహ్మణ్యం తెలిపారు. భారతదేశం 2047 నాటికి సుమారు 30 ట్రిలియన్ల డాలర్ల అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారడానికి ఒక విజన్ డాక్యుమెంట్ తయారవుతోందని, దానిని వచ్చే ఏడాది జనవరి చివరి నాటికి ప్రధాన మంత్రి విడుదల చేస్తారని వివరించారు. ఆదివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'భారతదేశం తన చరిత్రలో ఒక మలుపులో ఉంది. విద్య, ఆరోగ్యం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాలు, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల అద్భుతమైన విస్తరణ మద్దతుతో 21వ శతాబ్దం భారతదేశానికి చెందిన శతాబ్దంగా ఉంటుంది' అని అన్నారు. వినూత్న ఆలోచనలను కలిగి ఉండాల్సిన అవసరం ఉందని, ఎందుకంటే వ్యాపారంలో సాధారణ విధానం సహాయం చేయదని నీతి ఆయోగ్ సీఈవో తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ (అభివృద్ధి చెందిన భారతదేశం) విజన్‌కు ఆలోచన, సహకారం అందించడానికి యువతను ఆహ్వానించడం ద్వారా దేశ నిర్మాణంలో వినూత్న ఆలోచనలను మార్చడం చాలా ముఖ్యం' అని చెప్పారు.

స్కూల్ బస్సులో మంటలు

తప్పిన ఘోర ప్రమాదం
37 మంది చిన్నారులు క్షేమం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని మోటహల్దులో జాతీయ రహదారిపై 37 మంది పిల్లలతో వెళ్తున్న స్కూల్ బస్సులో మంటలు చెలరేగాయి. వెంటనే డ్రైవర్ అప్రమత్తమై బస్సును పక్కకు ఆపి స్థానికుల సాయంతో 37 మంది పిల్లలను సురక్షితంగా కాపాడారు. షాంఫోర్డ్ సీనియర్ సెండరీ స్కూల్‌కి చెందిన బస్సుగా గుర్తించారు. అగ్ని ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే, సమీపంలోని హైవే నిర్మాణంలో పని చేస్తున్న ఎన్‌హెచ్ ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఉద్యోగులు మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. కాసేపట్లోనే మంటలు అదుపులోకి వచ్చాయి. మంటలను ఆర్పే ప్రయత్నంలో డ్రైవర్ చేతులు కాలాయి. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణహాని కలగలేదు. బస్సులో మంటలు చెలరేగడానికి షార్ట్‌సర్క్యూటే కారణమని డ్రైవర్ చెబుతున్నాడు. ఇంతలో పాఠశాల యాజమాన్యం మరో బస్సును పంపించి పిల్లలను క్షేమంగా పాఠశాలకు తరలించారు. ఉత్తరాఖండ్ లోని షాంఫోర్డ్ సీనియర్ సెకండరీ స్కూల్ బస్సు డ్రైవర్ ఖేమ్ సింగ్ ఎప్పటిలాగే హల్దు చౌడ్ గ్రామీణ ప్రాంతాల నుంచి 37 మంది పిల్లలను శనివారం ఎక్కించుకుని పాఠశాలకు వెళ్తున్నాడు. ఉదయం 8 గంటల ప్రాంతంలో మోటహల్దు జాతీయ రహదారిపై జియో (రిలయన్స్) పెట్రోల్ పంపు ముందుకు చేరుకోగానే బస్సు లోపల ఇంజిన్ నుంచి కాలిన వాసన రావడంతో.. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సును హైవే పక్కన నిలిపాడు. కొదిసేపటికే బస్సు ఇంజన్ నుంచి భారీగా పొగలు వచ్చాయి. దీంతో భయభ్రాంతులకు గురైన చిన్నారు భయంతో కేకలు వేశారు. చిన్నారుల అరుపులు విని స్థానికులు, బాటసారులు బస్సు వైపు పరుగులు తీశారు. అప్పటికే డ్రైవర్ బస్సు ఎమర్జెన్సీ డోర్‌ను పగులగొట్టి పిల్లలను బయటకు తీయడం ప్రారంభించాడు. అక్కడికి చేరుకున్న స్థానికులు తలోచెయ్యివేసి పిల్లలను సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం బస్సులోని మంటలను ఆర్పేందుకు డ్రైవర్ ప్రయత్నించగా అతడి చేతులు కాలాయి. సమీపంలోని ఎన్‌హెచ్ నిర్మాణంలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీ ఉద్యోగులు, క్యాంపు సమీపంలోని నీటి ట్యాంకర్లను పైపులతో కనెక్ట్ చేసి, బస్సుపై నీళ్లు చల్లడం ప్రారంభించారు. మంటలను అదుపు చేసేందుకు సుమారు గంటపాటు శ్రమించారు. స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక బృందానికి సమాచారం అందించారు. హల్దు చౌద్ పోలీస్ పోస్ట్ ఇన్‌ఛార్జ్ సోమేంద్ర సింగ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. సమాచారం అందుకున్న గంట తర్వాత అగ్నిమాపక వాహనాలు వచ్చాయి. అప్పటికే బస్సులో మంటలు అదుపులోకి వచ్చాయి. హైవేపై ఈ సంఘటన జరగడంలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. హైవేకి ఇరువైపులా రాకపోకలు భారీగా నిలిచిపోయాయి. అయితే పోలీసులు రావడంతో ట్రాఫిక్‌ను ఖాళీ చేయించారు. మంటలను అదుపు చేయడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. బస్సులో ఉన్న పిల్లలందరూ పూర్తిగా సురక్షితంగా ఉన్నారు. ఇంజిన్ మంటలకు ఖచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు.

మాయావతి రాజకీయ వారసుడు ఆకాశ్ ఆనంద్

లక్నో: బహుజన సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్పీ) పార్టీ అధినేత్రి, మాజీ సీఎం మాయావతి తన రాజకీయ వారుసుడిని ప్రకటించారు. ఆదివారం లక్నోలో బీఎస్పీ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆమె ఉత్తరప్రదేశ్, ఉత్తరఖండ్ మినహా మిగతా దేశంలో తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్ రాజకీయ వారసుడిగా కొనసాగుతారని ప్రకటించారు. ఈ సమావేశంలో ఇటీవల జరిగిన మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్, ఫలితాలపై చర్చించారు. అదే విధంగా 2024లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థుల ఎంపికకు సంబంధించి చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ఇక దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఆకాశ్ ఆనంద్... మాయావతి పాత్ర పోషించనున్నారు. గత ఏడాది నుంచి ఆకాశ్ ఆనంద్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న విషయం తెలిసిందే. ఆయన మాయావతి చిన్న తమ్ముడి కుమారుడు. 2016లో పార్టీలో జాయన్ అయిన ఆనంద్... 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీలో స్టార్ క్యాంపయినర్‌గా పని చేశారు.

రాజేంద్రన్‌కు కన్నీటి వీడ్కోలు

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

కొట్టాయం: సీపీఐ కేరళ కార్యదర్శి కణం రాజేంద్రన్‌కు రాష్ట్ర ప్రజలు, నేతలు కన్నీటి వీడ్కోలు పలికారు. రాజేంద్రన్ అంత్యక్రియలు అధికార లాంఛనాలతో ఆయన స్వస్థలమైన కొట్టాయంలో ఆదివారం ముగిశాయి. సీపీఐ కార్యకర్తలు సహా వేలాది మంది ఘనంగా నివాళులర్పించారు. తమ ప్రియతమ నాయకుడి కడచూపు కోసం వందలాది మంది తరలిరాగా అంతిమ యాత్ర కిటకిటలాడింది. అంతిమ సంస్కారాలప్పుడు పార్టీ నినాదాలు మార్మోగాయి. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు కె.నారాయణ, వినయ్ విశ్వం, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తుది వీడ్కోలు పలికే సమయంలో డి.రాజా, రక్షణశాఖ మాజీ మంత్రి ఏకే ఆంటోని, వ్యవసాయ మంత్రి పి.ప్రసాద్ భావోద్వేగానికి లోనయ్యారు. రాజేంద్రన్ ఆకస్మిక మరణంతో పార్టీ వర్గాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. వందలాది మంది కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసిన రోడ్ల గుండా అంతిమ యాత్ర సాగింది. రాజేంద్రన్ శుక్రవారం కొచ్చిలోని ప్రైవేటు ఆసుపత్రిలో గుండెపోటుతో చనిపోయిన విషయం తెలిసిందే.

యువత ఓట్ల కోసం జగన్నాటకం

గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్లకు నాలుగున్నరేళ్లు పట్టిందా?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-విజయవాడ: మరో మూడు నెలల్లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున యువత ఓట్లకోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సరికొత్త జగన్నాటకానికి నాటకానికి తెరతీశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్ల విడుదల పేరుతో యువత ఓట్లు కొల్లగొట్టేందుకు జగన్ సర్కార్ కొత్త ఎత్తులకు సిద్ధమైందన్నారు. గత ఎన్నికలకు ముందు తాను అధికారంలోకి వస్తే ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక మాటమార్చి, మడమ తిప్పారని విమర్శించారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం చిత్తశుద్ధి చూపలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలు మార్చి 17న, గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షలు ఫిబ్రవరి 25న జరుగుతాయని ఏపీపీఎస్సీ ప్రకటించిందని, ఆ తరువాత మెయిన్స్ పరీక్షల నిర్వహణకు మరో 3 నుంచి 6 నెలల సమయం ఇచ్చారని తెలిపారు. ప్రిలిమ్స్ పరీక్షల కాలంలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. నిజంగా ఉద్యోగాలు భర్తీ చేయాలన్న చిత్తశుద్ధి ఉంటే గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేసేందుకు నాలుగున్నర సంవత్సరాలు సమయం ఎందుకు పట్టిందని ఆయన ప్రశ్నించారు. పైగా యూనివర్సిటీ ప్రొఫెసర్ నియామకాలలో రోస్టర్ పద్ధతి ఎందుకు రోస్టర్ పాటించడం లేదు? మెగా డీఎస్సీ విడుదలపై వైసీపీ ప్రభుత్వ వైఖరేంటి? కేవలం ఎన్నికలకు మరో మూడు నెలలే ఉండగా ఇప్పుడు హడావుడిగా గ్రూప్-1, 2 ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయడమంటే నిరుద్యోగ యువతను మోసం చేయడం కాదా? మళ్లీ వైసీపీ అధికారం చేపడితేనే యువతకు ఉద్యోగాలిస్తామనే సంకేతమేనా ఇది? యువతను మరోమారు మోసం చేసేందుకు వైసీపీ చేస్తున్న కుటిల యత్నాలుకావా? అని ప్రశ్నలు సంధించారు. నిరుద్యోగ యువతను నాలుగున్నరేళ్లుగా ద్రోహం చేసిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి బుద్ధిచెప్పే అవకాశం యువతకు మరో మూడు నెలల కాలంలో రానున్నదని రామకృష్ణ స్పష్టం చేశారు.

గాంధీ కుటుంబం చుట్టూ మోదీ అనుకూలురు

ముంబై: ప్రధాని నరేంద్ర మోదీకి అనుకూలమైన రాజకీయాలు చేసే వ్యక్తులు గాంధీ కుటుంబం చుట్టూ ఉంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మరిన్ని కష్టాలు తప్పవని శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ ఆదివారం అన్నారు. పార్టీ మౌత్‌పీస్ 'సామ్నా'లోని తన వారపు శీర్షిక రోఖ్‌ఠోక్‌లో, రౌత్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంఎస్) పై సందేహాన్ని లేవనెత్తాడు. బ్యాలెట్ పేపర్ల (పోస్టల్ బ్యాలెట్) కౌంటింగ్ సందర్భంగా మధ్య ప్రదేశ్‌లో కాంగ్రెస్ 199 స్థానాల్లో ఆధిక్యంలో ఉందని, అయితే ఈవీఎంలలోని ఓట్లను లెక్కించినప్పుడు పరిస్థితి మారిపోయిందని ఆయన పేర్కొన్నారు. 'మోదీ, షా (కేంద్ర మంత్రి అమిత్ షా) కు అనుకూలమైన రాజకీయాలు చేసే వ్యక్తులు గాంధీల చుట్టూ ఉంటే 2024లో మరింత ప్రమాదం పొంచి ఉంటుంది' అని పార్టీకి నాయకత్వం వహించిన మధ్య ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్‌నాథ్‌ను ఉద్దేశించి రౌత్ అన్నారు. మోదీ విజయ మాయాజాలం మూడు రాష్ట్రాల్లో పని చేసిందని, తెలంగాణలో మాత్రం కాదన్నారు. మోదీని కాంగ్రెస్ ఓడించలేదనేది కూడా అపోహ అని రాజ్యసభ సభ్యుడు అన్నారు. గతంలో మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో ఆ పార్టీ బీజేపీని ఓడించిందని, 2018లో ఈ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలను ఉద్దేశించి అన్నారు. అయినప్పటికీ ఈ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోయిందని శివసేన (యూబీటీ) నాయకుడు తెలిపారు.

విశాఖలో అట్టహాసంగా 'నేవీ డే'

ఆకట్టుకున్న విన్యాసాలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: అబ్బుర పరిచే విన్యాసాలతో విశాఖ సాగర తీరంలో యుద్ధ వాతావరణాన్ని తలపించేలా నావిక దళ విన్యాసాలు భారత్ సత్తా చాటాయి. నేవీ డే సందర్భంగా ఆదివారం విశాఖలోని ఆర్కే బీచ్ లో భారత నౌకాదళ వాయువిభాగం విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. విన్యాసాల్లో భాగంగా భారత నౌకాదళ పాటవం, పరాక్రమాన్ని ప్రదర్శించారు. దాదాపు 8వేల అడుగుల ఎత్తు నుంచి పారాచూట్ సాయంతో జాతీయ జెండా, నేవీ జెండాను ఎగురవేసి ఆహూతులను ఆశ్చర్య పర్చారు. నేవీ డే సందర్భంగా ఆర్కే బీచ్‌కు వెళ్లే అన్ని మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పాకిస్తాన్‌తో యుద్ధంలో విజయానికి ప్రతీకగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 4వ తేదీన నేవీ డే ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే మిచౌంగ్ తుపాను కారణంగా 10వ తేదీకి నేవీ డే ఉత్సవాలను వాయిదా వేసిన విషయం తెలిసిందే. తూర్పు నౌకాదళం అధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. నేవీ యుద్ధనౌకలు, ఫైటర్ జెట్లు, జలాంతర్గాములు, హెలికాప్టర్లతో సిబ్బంది విన్యాసాలు చేశారు. ఈ ఉత్సవాలను చూడడానికి ప్రజలు భారీగా తరలి వచ్చారు. దీంతో ఆర్కే బీచ్ జనసందోహంగా మారింది.భారత నావిక దళం సైన్యం సత్తాను చాటే విధంగా ఈ విన్యాసాలు చేపట్టారు. సాయంత్రం నగరంలో గుబులు పుట్టించే శబ్దాలతో యుద్ధ విమానాలు చక్కెర్లు కొడుతూ తీరం వెంబడి చేసిన నావిక విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు విడదల రజిని, గుడివాడ అమర్‌నాథ్, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీసు కమిషనర్ రవి శంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ, నగర మేయర్ హరి వెంకట కుమారి, అనకాపల్లి ఎంపీ సత్యవతి, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్, జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, నౌకాదళ సిబ్బంది హాజరయ్యారు.

17న బహిరంగ సభకు రాజధాని రైతుల కసరత్తు

చంద్రబాబు, పవన్ హాజరయ్యే అవకాశం

విశాలాంధ్ర-తుళ్లూరు: అమరావతి ఉద్యమం ప్రారంభించి ఈ నెల 17 నాటికి నాలుగేళ్లవుతున్న సందర్భంగా నాగార్జున యూనివర్సిటీ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు రాజధాని రైతులు సిద్ధమవుతున్నారు. సభను విజయవంతం చేయడం ద్వారా వైసీపీ సర్కారు మూడు రాజధానుల వైఖరిని తీవ్రంగా ఎండగట్టాలని పట్టుదలతో ఉన్నారు. సభ నిర్వహణకవసరమైన కార్యాచరణ కోసం రైతులు, రైతు కూలీలు, జేఏసీ నేతలు, దళిత జేఏసీ నాయకులు తుళ్లూరు గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, తాడికొండ మాజీ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు అక్రమ కేసులు పెట్టినా, దౌర్జన్యంగా లాఠీచార్జి చేసినా అధైర్యపడకుండా ఉద్యమాన్ని కొనసాగించిన రైతులు, మహిళలకు, రైతు కూలీలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. 17న నాగార్జున యూనివర్సిటీ వద్ద జరగబోయే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. అలాగే అమరావతి కోసం పోరాడే ప్రతి రాజకీయ పార్టీని అమరావతి జేఏసీ ఆహ్వానిస్తుందని అన్నారు. జేఏసీ అధ్యక్షుడు దనేకుల రామారావు మాట్లాడుతూ అమరావతి ఉద్యమానికి ఈ నెల 17న నాలుగు సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా 29 గ్రామాల్లోని జేఏసీ అధ్వర్యంలో రైతులు, రైతు కూలీలు, దళిత జేఏసీ నేతలు అందరూ కలిసి తలపెట్టబోయే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజధాని ప్రాంతంలోని రైతులు, మహిళలు, రైతు కూలీలు, దళిత జేఏసీ నేతలు బెల్లంకొండ నరసింహారావు, పువ్వాడ సుధాకర్, ఇడుపులపాటి సీతారామయ్య, జూజాల చలపతిరావు, కాటా అప్పారావు, ధనేకుల సుబ్బారావు, దామినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని కాకుండా

కాంగ్రెస్‌నే ఎందుకు లక్ష్యం చేయాలి?

ఒడిశాలో ఐటీ దాడులపై సిద్ధరామయ్య

బెంగళూరు: జార్ఖండ్ కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహూకు సంబంధించిన ప్రాంగణాల నుంచి రూ.200 కోట్లకు పైగా లెక్కల్లో చూపని నగదు స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో కేంద్రం కేవలం కాంగ్రెస్‌ను మాత్రమే లక్ష్యం చేసిందని, బీజేపీని ఎందుకు చేయలేదని కర్నాటక ముఖ్య మంత్రి సిద్ధరామయ్య ఆదివారం ప్రశ్నించారు. జార్ఖండ్‌లో ఒడిశాకు చెందిన రాజ్యసభ ఎంపీ ధీరజ్ సాహుకు సంబంధించిన సంస్థలపై ఇటీవల ఆదాయపు పన్ను శాఖ దాడులు నిర్వహించడంపై ఆయన స్పందించారు. 'వారు (బీజేపీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం) కాంగ్రెస్‌ను మాత్రమే లక్ష్యం చేస్తున్నారు. బీజేపీ నాయకులపై కూడా దాడులు చేయనివ్వండి. అప్పుడే వారి వద్ద ఎంత (అక్రమ సంపద) ఉందో తెలుస్తుంది' అని సిద్ధరామయ్య విలేకరులతో అన్నారు. ఆదాయపు పన్ను చట్టం ప్రకారం నల్లధనం ఎవరు కూడబెట్టినా అది తప్పేనని ముఖ్యమంత్రి అన్నారు. ఐటీ శాఖ చట్ట ప్రకారం చర్యలు తీసుకోనివ్వండన్నారు. అయితే, కేంద్ర సంస్థలు కాంగ్రెస్‌ను ప్రత్యేకించి లక్ష్యం చేస్తున్నాయని సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బీజేపీపై కాకుండా కాంగ్రెస్ నేతలపైనే వారి చర్య ఎందుకు? బీజేపీ వాళ్లపై దాడులు చేస్తే భారీగా డబ్బు దొరుకుతుంది' అని కర్నాటక ముఖ్యమంత్రి అన్నారు. ఒడిశాకు చెందిన బౌద్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్, దానితో సంబంధం ఉన్న సంస్థలపై ఆదాయపు పన్ను శాఖ జరిపిన సోదాల్లో ఇప్పటివరకు భారీ మొత్తంలో నగదు బయటపడింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సోదాల్లో భాగంగా ధీరజ్ సాహుకు సంబంధించిన ప్రాంగణాలు కూడా ఉన్నాయి. జప్తు మొత్తం రూ.290 కోట్లకు చేరుతుందని అంచనా.

గుట్కా ప్రకటన కేసులో

బాలీవుడ్ నటులకు నోటీసులు

న్యూఢిల్లీ: గుట్కా సంబం ధిత వాణిజ్య ప్రకటనల్లో పాల్గొన్నారంటూ కోర్టులో దాఖలయిన పిటిషన్ మేరకు ముగ్గురు బాలీవుడ్ అగ్రనటులకు కేంద్ర ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. షారూక్ ఖాన్, అక్షయ్ కుమార్, అజయ్ దేవ గన్ ఈ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారని అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్‌కు ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలియ జేశారు. అగ్రనటులు కొన్ని హానికారక ఉత్పత్తులకు సంబంధించి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ మోతీలాల్ యాదవ్ అనే న్యాయవాది గతంలో అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భారత ప్రభుత్వం నుంచి గౌరవప్రదమైన పురస్కారాలు, అందుకున్న వారు ఇలాంటి ప్రకటనల్లో పాల్గొనడం సరికాదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీన్ని విచారించిన కోర్టు... పిటిషనర్ అభ్యంతరాలపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని అప్పట్లో ఆదేశించింది. అయితే, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని పేర్కొంటూ ఇటీవల పిటిషనర్ మరోసారి కోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందన కోరుతూ కోర్టు కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఎస్‌బీ పాండే శు క్రవారం కోర్టుకు సమాచారం అందించారు. షారూక్ ఖాన్, అక్షయ్ కుమార్, అజయ్ దేవగన్‌కు అక్టోబరు 22నే షోకాజ్ నోటీసులు జారీ చేశామని వెల్లడించారు. ఈ విషయం కాస్త ఆలస్యంగా వెలుగులోకి రావడం గమనార్హం. మరోవైపు అమితాబ్ బచ్చన్ ఇప్పటికే ఈ తరహా ప్రకటనల నుంచి తప్పుకున్నారని కోర్టుకు పాండే తెలియజేశారు. అయినప్పటికీ, ఒక గుట్కా కంపెనీ ఆయన ప్రకటనలను ప్రసారం చేసిందని, దీంతో అమితాబ్ సదరు కంపెనీకి లీగల్ నోటీసులు పంపారని చెప్పారు. ఇదే అంశాన్ని సుప్రీం కోర్టు కూడా విచారిస్తున్నందున తక్షణ పిటిషన్‌ను కొట్టివేయాలని కేంద్రం తరపు న్యాయవాది శు క్రవారం హైకోర్టుకు నివేదించారు. దీంతో న్యాయస్థానం 2024 మే 9న విచారణ చేయాలని నిర్ణయించింది.

సీపీఎస్ రద్దు చేయలేదని

ఉపాధ్యాయుడి ఆత్మహత్యాయత్నం... పరిస్థితి విషమం

- అనంతపురం జిల్లా పెన్నహోబిలం వద్ద ఘటన
- జగన్ మాట తప్పారని టీచర్ మల్లేశ్ ఆవేదన

విశాలాంధ్ర-ఉరవకొండ: తాను అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేస్తానన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్న దిగులుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం చిన్న ముష్టూరు గ్రామానికి చెందిన బోయ మల్లేశ్ విడపనకల్లు మండలం పాల్తూరు ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యా యుడిగా పని చేస్తున్నారు. సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పిన సీఎం జగన్ మాట తప్పి మోసం చేశారని, అందుకే బలవన్మరణానికి పాల్పడుతున్నానని మల్లేశ్ ఐదు పేజీల లేఖ రాశారు. తన చావుకు సీఎం జగనే కారణమని పేర్కొన్నారు. ఈ లేఖను ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో తీవ్ర కలకలం రేగింది. మల్లేశ్ తన ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసి, పెన్నహోబిలం ఆలయం పరిసరాల్లో వ్యవసాయంలో ఉపయోగించే విషపు గుళికలు తిని ఆత్మహత్య యత్నం చేశాడు. సెల్‌ఫోన్ ఆధారంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ప్రాంతాన్ని పోలీసులు గుర్తించి... అక్కడికి చేరుకుని హుటా హుటిన ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతపురానికి మెరుగైన చికిత్స కోసం తీసుకుపోయారు. మల్లేశ్ ప్రభుత్వానికి రాసిన లేఖలో... నెల నెల సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడం వల్ల ఈఎంఐ కట్టుకోలేక బయట అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులకి గురవుతున్నానని పేర్కొన్నారు. తాను వైఎస్ రాజశేఖర్ రెడ్డి వీరాభిమానినని...ఆయన తనయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాడని ఎంతో నమ్మకంతో తనతో పాటు తన తోటి మిత్రులు బంధువులతో కూడా వైసీపీకి ఓట్లు వేయించానని... అయితే జగన్ ఉపాధ్యాయులను నిలువునా మోసం చేశాడని లేఖలో పేర్కొన్నారు. పీఆర్సీ, డీఏలు సకాలంలో అందిస్తాడని ఎంతో నమ్మకంతో ఉండేవాడినని... కానీ ఏ ఒక్కటి కూడా అమలు చేయకపోవడం బాధ కలిగించిందన్నారు ప్రభుత్వ ఉద్యోగుల పట్ల మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విధానాలు బాగున్నాయి అనే విధంగా జగన్‌మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నాడని లేఖలో పేర్కొన్నారు. తాను చనిపోయిన తర్వాత అయినా నాకు రావలసిన డీఏ, అరియర్స్ సకాలంలో అందిస్తారని కోరుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి పెద్ద సంఖ్యలో చేరుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మల్లేశ్‌ను పరామర్శించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి రాంభట్ల

ప్రత్యేక సంచిక ఆవిష్కరణ సభలో కల్లూరి భాస్కరం

హైదరాబాద్: బడి చదువు లేకపోయినా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించిన రాంభట్ల కృష్ణమూర్తి విశేషసంచిక ఆదివారం హైదరాబాదులో ఆవిష్కరించారు. "ఈ ప్రత్యేక సంచిక మూడేళ్ల కిందటే రావలసి ఉన్నప్పటికీ కరోనా కారణంగా జాప్యంజరిగింది. కానీ రాంభట్ల రచనలు, ఆలోచనలు ఇప్పుడే ఎక్కువ వర్తిస్తాయి. వాటి అవసరం కూడా ఎక్కువే" అని ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన సీనియర్ జర్నలిస్టు కల్లూరి భాస్కరం అన్నారు. రాంభట్ల వ్యక్తిత్వం అత్యంత విశిష్టమైందని, ఆయన అధ్యయనం లోతులు ఊహకు అందనివని, తన రచనలకు రాంభట్ల సాహిత్యం బాగా ఉపకరించిందని భాస్కరం అన్నారు.

అంతకు ముందు దారిదీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ ఈ సంచిక ప్రచురణకు నేపథ్యం వివరించారు. కరోనా సమయంలోనే ఈ సంచిక డిజిటల్ రూపంలో వెలువడిందని, ఇప్పుడు ముద్రణ రూపంలోకి తీసుకొచ్చామని ఆయన చెప్పారు. ఈ సంచికకు కావలసిన సరంజామా అంతా సిద్ధంచేసిన ఆర్వీరామారావ్ ఈ సంచికకు గౌరవ సంపాదకులుగా ఉన్నారని వర్మ చెప్పారు. రాంభట్ల శత జయంతి సందర్భంగా 2020లో ముద్రిత రచనల్లో అందుబాటులో లేని రచనలను పునర్ముద్రించాలనుకున్నామని, ఆక్రమంలో జనకథ, వేల్పులకథ, వేదభూమి గ్రంథాలు మూడేళ్ల కిందటే వెలువడ్డాయని సభకు అధ్యక్షతవహించిన ఆర్వీరామారావు చెప్పారు. సొంత కథ త్వరలో వెలువడుతుందని తెలియజేశారు. రాంభట్లకవిత్వం, సాహిత్య వ్యాసాలు, పీఠికలు కూడా క్రమంగా వెలువరిస్తామని ఆయన చెప్పారు. రాంభట్ల ఈనాడులో దాదాపు నాలుగేళ్ల పాటు రాసిన ఆదివారం సంపాదకీయాలు సేకరించాల్సి ఉందని ఆర్వీరామారావు తెలిపారు. ఈ సంచికను రూపొందించిన తీరు చాలా శాస్త్రీయంగా, ఆకట్టుకునేలా ఉందని పుస్తకాన్ని పరిచయం చేసిన మందలపర్తి కిశోర్ చెప్పారు. రాంభట్ల మిత్రులు, అనుచరులు, సమకాలికులు, ఆయన దగ్గర జర్నలిజం పాఠాలువిన్న వారిచేత వ్యాసాలు రాయించడం మంచి ప్రణాళిక అని కిశోర్ చెప్పారు. రాంభట్ల ఇప్పటికీ సమకాలికుడేనని, ఆయన రచనల మీద లోతైన పరిశోధన జరగాల్సి ఉందని కిశోర్ అన్నారు. జూం మాధ్యమం ద్వారా జరిగిన ఈ ఆవిష్కరణోత్సవంలో కుప్పిరెడ్డిపద్మనాభరెడ్డి, పత్తిసుమతి, కె.ఎస్.ఎన్. ప్రసాద్ మొదలైన వారు చర్చలో పాల్గొన్నారు. రాంభట్ల రచనలన్నింటిన్ని సేకరించి ప్రచురించడం సమాజానికిఅ వసరం అని వీరు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ వందన సమర్పణ చేశారు.

'విశాలాంధ్ర' సాహిత్య సేవలు అభినందనీయం

పుస్తక మహోత్సవం ప్రారంభోత్సవ సభలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

విశాలాంధ్ర-గుంటూరు: విశాలాంధ్ర సాహిత్య సేవలు అభినందనీయమని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. విశాలాంధ్ర బుక్‌హౌస్ అధ్వర్యంలో గుంటూరు ఏఎల్‌బీఈడీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 23వ పుస్తక మహోత్సవం(పుస్తక ప్రదర్శన)ను శ్రీకృష్ణదేవరాయలు ఆదివారం ప్రారంభించారు. అనంతరం విశాలాంధ్ర విజ్ఞాన సమితి డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ మంచి పుస్తకాలను ప్రజలకు చేరువ చేసే కార్యక్రమాన్ని 23 ఏళ్లుగా విశాలాంధ్ర సాగిస్తోందన్నారు. చరిత్రతో పాటు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మార్పులపై అవగాహన పెంచుకునేందుకు పుస్తక పఠనం దోహదమవుతుందన్నారు. నేడు విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు ఆకర్షితులై పుస్తక పఠనాన్ని విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పుస్తక పఠనం ఆవశ్యకతను తెలియజేసేందుకు విశాలాంధ్ర దృష్టి సారించాలని శ్రీకృష్ణదేవరాయలు కోరారు. పాఠశాల, కళాశాల స్థాయిలో పుస్తక పఠనంపై పోటీలు నిర్వహించాలని, అందుకు సహాయ సహకారాలను తన తరఫున, విజ్ఞాన్ విద్యా సంస్థల నుంచి అందిస్తానని ఎంపీ హామీఇచ్చారు. పుస్తక ప్రదర్శనను పెద్దలతో పాటు పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజ్ఞానసమితి అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు తెలుగు సాహిత్యాన్ని, తెలుగు భాషను చేరువ చేయడంలో విశాలాంధ్రది కీలకపాత్రన్నారు. దేశభక్తి, అభ్యుదయ భావజాలంతో కూడిన వేర్వేరు పుస్తకాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయని, అన్ని వర్గాల పిల్లలకు విజ్ఞానం, వినోదం అందించే తెలుగు, ఆంగ్ల భాషలలో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగా మాట్లాడుతూ తెలుగు వారి సాంస్కృతిక ఉద్యమానికి విశాలాంధ్ర చేసే కృషి ఎనలేనిదన్నారు. అనేక మంది సాహిత్యకారులను పరిచయం చేసిందన్నారు. తొలుత పుస్తక ప్రదర్శనను అతిథులు సందర్శించారు. వివిధ రచయితల పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, విజ్ఞాన సమితి మాజీ జనరల్ మేనేజర్ గూడవల్లి నాగేశ్వరరావు, అరసం జిల్లా కార్యదర్శి బుల్లా రవి, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు, ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి హనుమంతరెడ్డి, నాయకులు వాణి, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, రచయిత సుభాని, విశాలాంధ్ర బుక్‌హౌస్ గుంటూ రు శాఖ మేనేజర్ మురకొండ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.